ప్రజాశక్తి
శుక్రవారం 1 మార్చి 2024 8 పేజీలు





ప్రకాశం బాపట్ల

పొగాకు రైతులకు నిరాశ

- ప్రారంభ గరిష్ట ధర రూ.250 మాత్రమే..
- రైతులు ఆశించిన ధర కిలోకు రూ.300



వేలంలో పాల్గొన్న వ్యాపారులు

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

పొగాకు కొనుగోళ్ల ఆరంభంలోనే రైతులు నిరాశకు గురయ్యారు. రైతులు ఆశించిన ధరను వ్యాపారులు ఇవ్వలేదు. ఒంగోలు, కొండపి కేంద్రాల్లో గురువారం నాడు వేలం ప్రారంభమైంది. 18 బేళ్ల చొప్పున అమ్మకాలకు పెట్టారు. బోర్డు అధికారులు కిలో రూ.260తో మొదలుపెట్టారు. ఒంగోలు కేంద్రంలో కిలోకు రూ.250 గరిష్ట ధర ఇవ్వగా కనిష్ట ధర రూ.230 ఇచ్చారు. కొండపి కేంద్రంలో 18 బేళ్లకూ ఒకటే ధర రూ.230 ఇచ్చారు. అయితే రైతులు ఈ ధరలను చూసి తీవ్ర నిరాశకు గురయ్యారు. కిలోకు రూ300 ఆశించారు. అప్పుడే కనీసం పెట్టిన పెట్టుబడులైనా వస్తాయని ఆశించారు. గతేడాది కిలో రూ.200తో వేలం మొదలై రూ.289 వరకూ వెళ్లింది. అంటే గతేడాది గరిష్ఠ ధరతో కూడా వేలం ప్రారంభం కాలేదు. వ్యాపారులు ధర ఇవ్వడానికి సిద్ధంగా కనిపించలేదు. బోర్డు అధికారులే ముందుగా గతేడాది గరిష్ట ధరతో వేలం ప్రారంభించాలని గట్టిగా నిర్దేశిస్తే కొంత మేలు జరిగేది. ఎందుకంటే తుపాను వల్ల రైతులు రెండు, మూడు సార్లు నాట్లు వేశారు. నీటి కోసం ఎకరాకు రూ.లక్ష వరకూ ఖర్చుపెట్టారు. బ్యారన్‌కు రూ.10 లక్షలు పెట్టుబడి పెట్టారు. పెట్టినదంతా తిరిగి రావాలని భావించి.. కిలోకు రూ.300 ధర ఆశించారు. వ్యాపారులు చాలా తక్కువగానే ధర ఇచ్చారు. కిలోకు రూ.250 కూడా ఒక్క బేడుకే.. మిగతావన్నీ రూ.230కే కొన్నారు. గిట్టుబాటు ధర కల్పనకు బోర్డు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించడంలో

రాష్ట్ర ప్రభుత్వం విఫలం

5లో

వలస బాట..

- గ్రామాల్లో 'ఉపాధి' కరువు..
- పనుల కోసం నగరాలకు వెళుతున్న పశ్చిమ ప్రాంత ప్రజలు
- మంత్రి ఇలాకాలో దుస్థితి..

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

చినుకు పలకరించలేదు. పొలాలు తడవక, రైతులు కష్టాల సుడిలో చిక్కుకున్నారు. పెట్టుబడి సైతం చేతికందని దయనీయం. కూలి పనులు చేసుకుందామన్నా అవీ లేదు. ఆకలితో అల్లాడిపోతున్నా ప్రభుత్వం ఆదుకుంటుందన్న భరోసా కనిపించలేదు. పల్లె వాకిట్లో కరువు చేరింది. ఉపాధి దూరమైంది. పల్లె జనం వలస బాట పడుతోంది. చిన్నారులు బడిబాట మాని, అమ్మానాన్నతో పాటు పయనమయ్యారు. ఇదీ పశ్చిమ ప్రాంతంలోని యర్రగొండపాలెం నియోజకవర్గంలో గ్రామాల దుస్థితి.



వలస వెళుతున్న పేదలు

యర్రగొండపాలెం నియోజకవర్గంలోని యర్రగొండపాలెం, పుల్లలచెరువు, త్రిపురాంతకం మండలాల నుంచి ప్రతిరోజూ వందల కుటుంబాల వలసబాట పడుతున్నాయి. ఈ ఏడాది వర్షాభావ పరిస్థితుల కారణంగా పంటలు పండక పశ్చిమాన కరువు విలయ తాండవం చేస్తోంది. స్థానికంగా ఎలాంటి పనులు లేకపోవడంతో కుటుంబసభ్యులంతా పొట్టచేత పట్టుకుని ఊరొదిలి సుదూర ప్రాంతాలకు వలస వెళ్తున్నారు.

25 వేల మంది వలసబాట..

యర్రగొండపాలెం నియోజకవర్గంలో ఇప్పటికే సుమారు 25 వేల మంది వలసబాట పట్టారు. చిత్తూరు, బెంగుళూరు, తెలంగాణ, గుంటూరు, విజయవాడ, పల్నాడు తదితర ప్రాంతాలకు వలస వెళ్తున్నారు. వీరంతా కాలం వలిసి వచ్చి జూన్ నెలలో పుష్కలంగా వర్షాలు కురిసిన తర్వాత వ్యవసాయ పనులు ఊపందుకుంటే కానీ తిరిగి సొంత ఊర్లకు రారు. అప్పటి దాకా మిరప కూలీలు, మట్టి పని, చెరుకు కోత, బెల్దాని పని ఇలా పనులు చేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటూ ఆ ప్రాంతంలోనే ఉంటామని తెలంగాణాకు వెళ్లిన మురారిపల్లి గ్రామానికి చెందిన వెంకటయ్య తెలిపాడు. జూన్ చివరి దాకా ఆ ప్రాంతంలోనే ఉంటామని మొగుళ్లపల్లికి చెందిన కోటేష్ తెలిపాడు. గత్యంతరం లేక పిల్లలను మధ్యలో చదువు ఆపి తమతోనే తీసుకెళ్లామని తెలిపాడు. ప్రతియేటా నవంబర్ నుంచి ఏప్రిల్ వరకు సీజనల్ హాస్టళ్లు ఏర్పాటు చేసేవారని తమ్మడపల్లికి చెందిన లక్ష్మయ్య చెప్పాడు. తాము వలసలు వెళ్లిన తమ పిల్లలను సీజనల్ హాస్టల్‌లో వదిలి వెళ్లే వారని తెలిపాడు. ఈ ఏడాది సీజనల్ హాస్టళ్లు ఏర్పాటు చేయకపోవడంతో పిల్లలను కూడా వెంట పెట్టుకొని పోవాల్సి వచ్చిందని వాపోయాడు.

మంత్రి సురేష్ ఇలాకాలో..

రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ ప్రాతినిధ్యం వహిస్తున్న యర్రగొండపాలెం నియోజకవర్గంలోనూ వలస బాట తప్పడం లేదని పేదలు వాపోతున్నారు. ఉపాధి పనులు కుటుంబాలను పోషించలేకపోతున్నాయని చెప్పారు. ఉన్న అరకొర పొలాలను సాగు చేసుకున్నా నీటి లభ్యత లేకపోవడంతో నిలువునా ఎండిపోతున్నాయంటున్నారు. పెట్టిన ▶ 2లో

పెండింగ్ కేసుల

సత్వర పరిష్కారానికి కృషి

- గుడ్ ట్రయల్ మానిటరింగ్ ద్వారా ముద్దాయిలకు శిక్షలు పడేలా చేయాలి
- ఎన్నికల విధులు నిష్పక్షపాతంగా నిర్వర్తించాలి
- నేర సమీక్షలో ఎస్పీ పరమేశ్వరరెడ్డి



మాట్లాడుతున్న ఎస్‌పి పరమేశ్వరరెడ్డి

ప్రజాశక్తి-ఒంగోలు క్రైం

జిల్లాలోని పోలీస్‌స్టేషన్లలో పెండింగ్‌లో ఉన్న కేసులను సత్వరమే పరిష్కరించాలని పోలీస్ అధికారులను ఎస్పీ పరమేశ్వరరెడ్డి ఆదేశించారు. జిల్లాలోని డిఎస్పీలు, సిఐలు, ఎస్సైలతో గురువారం ఎస్పీ జిల్లా పోలీసు కార్యాలయంలో నెలవారీ నేరసమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎస్పీ ప్రత్యేకించి గ్రేవ్, గత ఎలక్షన్ సంబంధిత కేసులు, పలు రకాల షీట్స్, పి.డి యాక్టు, గుడ్ ట్రయల్ మానిటరింగ్ కేసులు మరియు ఇతర అంశాలను సమీక్షించి ఆయా కేసుల ప్రస్తుత స్థితిగతులు, పురోగతిపై ఆరా తీశారు. ఆ కేసుల ఛేదింపునకు దోహదపడే పలు మెలకువలు, సూచనలు దిశానిర్ధేశం చేశారు. విచారణలో ఉన్న మర్డర్, మహిళలపై జరిగే నేరాలు, దొంగతనం, పోక్సో/రేప్ మరియు ఇతర గ్రేవ్ కేసుల్లో ప్లాన్ ఆఫ్ యాక్షన్ తో దర్యాప్తు త్వరగా పూర్తిచేయాలన్నారు. అందుకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానం విరివిగా ఉపయోగించుకోవాలని చెప్పారు. సంబంధిత కేసుల్లో ఆర్ఎఫ్ఎస్ఎల్/ఎఫ్ఎస్ఎల్ రిపోర్టులను త్వరితగతిన తెప్పించి నిర్ణీత సమయంలో ఛార్జ్‌షీట్ ఫైల్ చేయాలన్నారు. గుడ్ ట్రయల్ మానిటరింగ్ ద్వారా కేసుల్లో శిక్షల శాతం పెంచేందుకు కషి చేయాలని సూచించారు. చోరీ కేసులను అన్ని కోణాల్లో విచారణ చేసి చోరీలకు పాల్పడిన వారిని గుర్తించి సొత్తును రాబట్టాలన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కల్గిస్తూ, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న వారిపై పీడీ చట్టం ప్రకారం చర్యలు తీసుకొనుటకు ప్రతిపాదనలు పంపాలన్నారు.

త్వరలో జరగనున్న ఎన్నికల దృష్ట్యా పోలీస్ అధికారులు సిబ్బంది సంసిద్ధంగా ఉండాలని, ఎన్నికలను శాంతియుతంగా జరిపించేలా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని చెప్పారు. సమస్యాత్మక/అతి సమస్యత్మక గ్రామాలను విరివిగా సందర్శించి అక్కడి లా అండ్ ఆర్డర్ సమస్యలపై దష్టి సారించాలన్నారు. గ్రామాలకు వచ్చు పోవు అనుమానిత/కొత్త వ్యక్తుల ▶ 2లో

2న టిడిపిలోకి మాగుంట?

జిల్లాలో లోకేష్ పర్యటనలో పాల్గొనేలా ఆలోచన



ఒంగోలులో ఓ ప్రైవేటు హాస్పిటల్ ప్రారంభోత్సవంలో బాలినేనితో కలిసి పాల్గొన్న ఎంపీ మాగుంట

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

వైసిపిని వీడిన ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి తెలుగుదేశంలో చేరేందుకు మంచి రోజు చూసుకుంటున్నారు. ఇప్పటికే తెలుగుదేశం అధినేత చంద్రబాబుతో సంప్రదింపుల్లో ఉన్న ఆయన ఆ పార్టీలో చేరేందుకు సమయం చూసుకుంటున్నారు. మార్చి మూడు నుంచి జిల్లాలో పార్టీ జాతీయ కార్యదర్శి నారా లోకేష్ శంఖారావం ఉన్నందున ముందురోజే పార్టీలో చేరాలనే ఆలోచనలో మాగుంట శ్రీనివాసులరెడ్డి ఉన్నట్లు తెలుస్తోంది. రెండో తేదీన పార్టీలోకి చేరితే లోకేష్ సభల్లో పాల్గొనడానికి వీలుంటుందనే ఆలోచన చేస్తున్నారు. ఈ విషయాన్ని మాగుంట అధికారికంగా వెల్లడించాల్సి ఉంది. పార్టీకి రాజీనామా చేసినట్లు ప్రకటించిన మాగుంట ఒంగోలు ఎంపీ అభ్యర్థిగా తన కుమారుడు పోటీ చేస్తారని చెప్పారు. అంటే తండ్రీకొడుకులు ఇద్దరూ తెలుగుదేశంలో చేరడానికి సన్నాహాల్లో ఉన్నారు. ఒంగోలు పార్లమెంటుకు తెలుగుదేశం నుంచి మాగుంట రాఘవరెడ్డి పోటీ ఖాయంగానే కనిపిస్తోంది. వైసిపి నుంచి చెవిరెడ్డి భాస్కరరెడ్డిని కూడా సమన్వయకర్త పేరుతో అభ్యర్థిగా ఖరారు చేశారు. వీరిద్దరి మధ్య పోటీ జరగనుంది. ఇదిలా ఉండగా పార్టీని వీడిన ఎంపీ మాగుంట, మాజీ మంత్రి బాలినేని ఇద్దరూ కలిసి నగరంలో గురువారం కూడా పలు కార్యక్రమాల్లో పాల్గొనటం గమనార్హం.

పరిహారం మరిచి.. రోడ్డు నిర్మాణం

అభ్యంతరం వ్యక్తం చేస్తున్న రైతులు, ప్రజలు

ప్రజాశక్తి-సిఎస్ పురంరూరల్

రోడ్డు నిర్మాణం కోసం తీసుకున్న భూములకు, గృహాలకు పరిహారం ఇవ్వకుండా రోడ్డు నిర్మాణ పనులు చేస్తుండడం పట్ల రైతులు ప్రజలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని డిజిపేట, కృష్ణంనాయునిపల్లి, గణేషన్ పల్లి, అంబవరం, ఏ కొత్తపల్లి తదితర గ్రామాల పరిధిలో మైదుకూరు సింగరాయకొండ నేషనల్ హైవే రోడ్డు నిర్మాణ పనులు చేపడుతున్నారు. అయితే ఈ రోడ్డు నిర్మాణం కోసం రైతుల నుంచి సేకరించిన వ్యవసాయ భూములకు, గృహాలకు, ఇంటి స్థలాలకు ప్రభుత్వం అందజేయాల్సిన నష్టపరిహారం లబ్ధిదారులకు ఇవ్వకుండానే పనులు చేపట్టేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. దీనిపై రైతులు, ప్రజలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఈ రోడ్డు నిర్మాణం కోసం 2018–19 ప్రాంతంలో భూమిని సేకరించిన అధికారులు నేటికీ పరిహారం చెల్లించకపోగా రోడ్డు నిర్మాణ పనులు చేపడుతున్నామని, తాము సేకరించిన భూమిని, ఇళ్లను ఖాళీ చేసి తమకు అప్పగించాలనటం పట్ల కృష్ణమనాయునిపల్లి రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు నిర్మాణం చేపడితే తమకు రావాల్సిన పరిహారం గురించి పట్టించుకునేవారే ఉండరని, తమకు పరిహారం అందజేసిన తర్వాతనే రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని, అప్పటివరకు పనులు చేయనిచ్చేది లేదని వారంటున్నారు. ఈ విషయంపై విఆర్ఓ నాగరాజును ప్రజాశక్తి విలేఖరి వివరణ కోరగా నష్టపరిహారం నిధులు వచ్చి ఉన్నాయని, గ్రామంలో సర్వే నిర్వహించి పరిహారం నిధులను లబ్ధిదారులకు అందజేస్తామని పేర్కొన్నారు.



రోడ్డు నిర్మాణంలో కోల్పోతున్న ఇల్లు

ఖాళీ చేసి అప్పగించకపోతే ఇల్లు కూల్చేస్తామంటున్నారు
మర్రి చిన్న నాగయ్య, కృష్ణంనాయునిపల్లి



రోడ్డు నిర్మాణం కోసం తన ఇంటిని ఖాళీ చేసి ఇవ్వాలని, లేదంటే ఉన్నతాధికారులను తీసుకొచ్చి మీ ఇంటిని కూల్చేస్తామని స్థానిక అధికారులు అంటున్నారని కృష్ణమనాయునిపల్లికి చెందిన మర్రి చిన్న నాగయ్య ఆందోళన వ్యక్తం చేశారు. రూ.25 లక్షల దాకా పరిహారం వస్తుందని అప్పట్లో చెప్పారని, ఇప్పటివరకు పరిహారం ఇవ్వకపోగా ఇప్పుడు రెండు లక్షల కంటే ఎక్కువ వచ్చే అవకాశం లేదంటున్నారని వాపోయారు.

పరిహారం చెల్లించకుంటే పనులు చేయనిచ్చేది లేదు
ముడుమాల లక్ష్మీనరసయ్య, రైతు, కృష్ణంనాయునిపల్లి



రోడ్డు నిర్మాణం కోసం మా పూర్వీకుల నుంచి మాకు సంక్రమించిన 80 సెంట్లు భూమిని తీసుకున్నారు. ఆ భూమికి ఇప్పటివరకు పరిహారం అందించలేదు. మా నుంచి తీసుకున్న భూమిని సర్వే చేసి మా అన్నదమ్ములకు సమాన వాటాలుగా పరిహారం అందజేయాలని కోరాము. పరిహారం ఇవ్వకుండా దౌర్జన్యంగా మా పొలంలో రోడ్డు పనులు చేస్తున్నారు. మాకు న్యాయం చేయండి అని రైతు ముడుమాల లక్ష్మీనరసయ్య వాపోతున్నారు.

వలస బాట..

(మొదటిపేజీ తరువాయి)

పెట్టుబడులు కూడా రాలేదంటున్నారు. వెలుగొండ ప్రాజెక్టు నిర్మాణం పూర్తైతే తమ బతుకులు బాగు పడతాయని చెబుతున్నారు. అయితే దాని నిర్మాణ విషయంలో ఊరిస్తున్నారే తప్ప పూర్తి చేయలేకపోతున్నారని పేర్కొన్నారు. బత్తాయి, బొప్పాయి పంటలు ఈ ప్రాంతంలో అధికంగా పండినా జ్యూస్ ఫ్యాక్టరీలు ఏర్పాటు చేయకపోవడంతో ఉపాధి కరువైంది. దళితులు ఎక్కువగా ఉన్న దళిత నియోజకవర్గంలో లెదర్ పార్కును ఏర్పాటు చేస్తామని ప్రతి ఎన్నికల్లో హామీ ఇస్తున్నారే తప్ప అమలు జరగలేదు. దీంతో వలసలు తప్పడం లేదు. దీనికి తోడు ఈ ఏడాది ఖరీఫ్, రబీల్లో వర్షాలు రాకపోవడంతో గత్యంతరం లేక పిల్లా పాపలతో కలిసి వలసబాట పడుతున్నామని పశ్చిమ ప్రాంత ప్రజలు వాపోతున్నారు.



నేర సమీక్షా సమావేశంలో పాల్గొన్న పోలీసులు

పెండింగ్ కేసుల సత్వర పరిష్కారానికి కృషి

(మొదటిపేజీ తరువాయి)

ముందస్తు సమాచారం సేకరించాలని, ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో పోలింగ్ కేంద్రాలను అధికారులు సందర్శించి, అక్కడ తగిన భద్రతా ఏర్పాట్లపై చర్యలు తీసుకోవాలన్నారు. గత ఎన్నికలలో జరిగిన నేరాలను సమీక్షించి ఆయా ప్రాంతాల్లో పునరావతం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

ప్రతి సెక్టార్ పోలీస్ ఆఫీసర్ వారి పరిధిలోని గ్రామాలను సందర్శించి, ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే అవకాశం వుందా, గతంలో వర్గవిభేదాలు, రాజకీయ గొడవలు జరిగాయా, ప్రస్తుత పరిస్థితులు ఎలా వున్నాయి తదితర విషయాలను తెలుసుకోవాలన్నారు. ఎన్నికల నియమ నిబంధనల తప్పక పాటించాలని, పోలీస్ అధికారులు సిబ్బంది నిష్పక్షపాతంగా ఎన్నికల విధులు నిర్వర్తించాలన్నారు.

తీవ్ర నేరాల షీట్స్‌లోని వారిపై నిరంతర నిఘా ఉంచాలని, విచారణలో ఉన్న షీట్స్‌లోని నిందితులకు తగిన శిక్షపడే విధంగా చూడాలని, పాత నేరస్తుల కదలికలను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలని, వారి యొక్క నివాసాలను తరచూ సందర్శించి వారి పూర్తి వివరాలను అప్‌డేట్ చేసుకోవాలని, జీవనవిధానం, ఏదైనా నేరానికి పాల్పడే అవకాశం ఉన్నదా వంటి విషయాలను తెలుసుకోవాలన్నారు. గత ఎన్నికల ట్రబుల్ మాంగర్స్ ను, నేర చరిత కల్గిన వారు నేరాలకు పాల్పడకుండా వారిని బైండోవర్ చెయ్యాలని సూచించారు.

ఎస్‌సిఆర్‌బి, ఎన్‌సిఆర్‌బి, హ్యూమన్ రైట్స్, ఎస్సీ/ఎస్టీ, మహిళా కమీషన్ మరియు ఇతర కమిషన్ల నుండి వచ్చిన పిటిషన్ లకు తగిన రిప్లై వెంటనే ఇవ్వాలని, డిపిఒకు సంబంధించిన పెండింగ్ రిప్లైలను త్వరితగతిన పంపించాలని అధికారులను ఎస్పీ ఆదేశించారు.

ప్రజా ఫిర్యాదులను తీర్చడానికి ఎల్లవేళలా అందుబాటులో ఉండాలని, పోలీసులు ప్రజలకు జవాబుదారీగా పని చేస్తూ ఫిర్యాదుల పట్ల జాప్యం చేయకుండా తక్షణమే స్పందించాలని, ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకుని చట్ట పరిధిలో న్యాయం చేయాలని సూచించారు. జిల్లా ప్రశాంతత, శాంతిభద్రతల పరిరక్షణ కోసం అందరం కలిసి సమిష్టిగా సమర్థవంతంగా విధులు నిర్వర్తిద్దాం అని తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్పీ (అడ్మిన్) కె.నాగేశ్వరరావు, ఏఎస్పీ (క్రైమ్)యస్.వి.శ్రీధర్ రావు, డిఎస్పీలు రామచంద్ర, రామరాజు, అశోక్ వర్ధన్, బాల సుందరం, వి. శ్రీనివాసులు, శ్రీనివాసరావు, ట్రైనీ డిఎస్పీ షేక్ షహబాజ్, పోలీస్ లీగల్ అడ్వైజర్ వేణుగోపాల్, సీఐలు, ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి 24 గంటలూ రాకపోకలు

ప్రజాశక్తి-పెద్దదోర్నాల: శ్రీశైలం బ్రహ్మోత్సవాలు ఈ నెల ఒకటో తేదీ నుంచి 11వ తేదీ వరకు జరగనున్న నేపథ్యంలో దోర్నాల నుంచి శ్రీశైలం వచ్చి పోయే వాహనాలకు ఘాట్ రోడ్డులో 24 గంటలూ అనుమతి ఇచ్చినట్లు అటవీ క్షేత్రాధికారి విశ్వేశ్వరరావు గురువారం తెలిపారు. ఈ వెసులుబాటును గమనించి భక్తులు తమ ప్రయాణాలను కొనసాగించుకోవచ్చని చెప్పారు.

అంబేద్కర్ విగ్రహానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-శింగరాయకొండ: శింగరాయకొండ గ్రామ పంచాయతీ పరిధిలోని బాలాజీ నగర్ జంక్షన్ వద్ద డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి గురువారం రాత్రి శంకుస్థాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. కందుకూరు మాజీ జడ్పీటీసీ సవలం చెన్నకేశవులు ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో అంబేద్కర్ పీపుల్ జేఏసీ జాతీయ అధ్యక్షులు అంబటి కొండలరావు, పులుగుర కష్టయ్య, కూతల ప్రసాద్, బిల్లా కోటేశ్వరరావు, చొప్పర శివ పంచాయతీ వార్డు మెంబర్ గంజి సుబ్బారావు, టిడిపి నాయకులు పసుపులేటి శేషు పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న నాయకులు



మానవహారం నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది

పోలియోను నిర్మూలిద్దాం

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

పోలియో నిర్మూలిద్దాం, నిండు జీవితానికి రెండు చుక్కలు, ఐదు సంవత్సరాలు లోపు పిల్లలకు పోలియో చుక్కలు వేయిద్దాం, పోలియోను పాలద్రోలుదాం అంటూ పెద్ద దోర్నాలలో వైద్యశాఖ ఆధ్వర్యంలో ర్యాలీ, మానవహారం నిర్వహించారు. ర్యాలీని ఉద్దేశించి చింతల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ వైద్యశాల పరిధిలో 31,621 జనాభా ఉన్నారన్నారు. 7,438 గృహాలు ఉన్నట్లు తెలిపారు. 3,631 మంది ఐదు సంవత్సరాలలోపు పిల్లలు ఉన్నట్లు గుర్తించారు. పోలియో చుక్కలు వేయడానికి 23 బూత్‌లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. వంద శాతం పోలియో చుక్కలు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అగ్నిక్, వైద్య సిబ్బంది కందుల ఇజ్రాయేలు, కె సత్యనారాయణరెడ్డి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలకు నిత్యావసరాల పంపిణీ

ప్రజాశక్తి-యర్రగొండపాలెం: యర్రగొండపాలెంలోని ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాలలో దాతల సహకారంతో ప్రతిరోజూ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేస్తున్నారు. విషయం తెలుసుకున్న చిలకలూరిపేట సిఆర్ కళాశాలకు చెందిన రిటైర్డ్ రసాయన శాస్త్ర విభాగాధిపతి జివి రాఘవులు యర్రగొండపాలెంలోని ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాలలో రసాయన శాస్త్ర అధ్యాపకులుగా పని చేస్తున్న డాక్టర్ జి పుష్పరాజు ద్వారా రూ.5 వేల విలువైన బియ్యం, కందిపప్పు, వంట నూనెలను గురువారం కళాశాలకు అందజేశారు. దాతల సహాయ సహకారాలతో మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేయడం హర్షణీయమని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి శ్రీధర్ నాయుడు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి ప్రదీప్, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.



నిత్యావసర సరుకులు అందజేస్తున్న దృశ్యం

ముందు వెళ్తున్న లారీని ఢీకొన్న బైకు..

- అన్న మృతి, తమ్ముడికి తీవ్ర గాయాలు
- మార్టూరు వద్ద ఘటన

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

ముందు వెళ్తున్న లారీ షడన్‌గా బ్రేకులు వేయడంతో వెనుక వస్తున్న బైకు అదుపు తప్పి ఢీకొన్న ఘటనలో అన్న మృతిచెందాడు. తమ్ముడికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన మార్టూరు సమీపంలోని ఇసుక దర్శి ఫ్లైఓవర్ బ్రిడ్జిపై గురువారం చోటు చేసుకుంది. మార్టూరు అర్బన్ సిఐ ఎస్‌వి. రాజశేఖర్ రెడ్డి కథనం ప్రకారం.. కొరిశపాడు మండలం మేదరమెట్ల లాల్ బహుదూర్ శాస్త్రి నగర్‌కు చెందిన చెందిన గుడిపాటి నాగ బ్రహ్మయ్య (48) గుడిపాటి సాంబశివరావు అన్నదమ్ములు. ఇటీవల వారి తండ్రి ఆదినారాయణ మతి చెందాడు. తండ్రి అస్థికలు



మృతిచెందిన నాగబ్రహ్మయ్య



గాయపడిన సాంబశివరావు

కష్ణానదిలో కలిపేందుకు గురువారం వేకువజామున బైకుపై విజయవాడ వెళ్లారు. కార్యక్రమం పూర్తయిన తర్వాత స్వగ్రామం మేదరమెట్ల బయలు దేరారు. బైకు ఇసుక దర్శి వద్దకు వచ్చే సరికి ముందు వెళుతున్న లారీ డ్రైవర్ సడన్‌గా బ్రేకులు వేశాడు. దీంతో బైకును అదుపు చేయలేక లారీ ఢీకొన్నారు. దీంతో నాగ బ్రహ్మయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. తమ్ముడు సాంబశివరావు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల సమాచారంతో 108 సిబ్బంది ఘటనా స్థలాన్ని చేరుకొని క్షతగాత్రుడిని మార్టూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం గుంటూరు సర్వజన సమగ్ర ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుడు నాగ బ్రహ్మయ్య మేదరమెట్లలో మెడికల్ షాప్ నిర్వహిస్తూ వైసిపి కార్యకర్తగా ఉన్నాడు. క్షతగాత్రుడు సాంబశివరావు సింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో అటెండర్‌గా పని చేస్తున్నాడు. మృతదేహానిన పోస్టు మార్టం మార్టూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కంటైనర్‌ను ఢీకొన్న ఐషర్..

- ఓ డ్రైవర్ మృతి
- మరో డ్రైవర్‌కు తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-శింగరాయకొండ

కంటైనర్, ఐషర్ లారీ ఢీకొన్న ఘటనలో ఓ డ్రైవర్ మృతి చెందాడు. మరో డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన మండల పరిధిలోని కనుమళ్ల సమీపంలో జాతీయ రహదారిపై గురువారం చోటు చేసుకుంది. అందిన వివరాల ప్రకారం... చెన్నై నుంచి ఒంగోలు వైపుకి వెళ్తున్న కంటైనర్ డ్రైవర్ నిద్ర మత్తులో రాంగ్ రూట్‌లో కావలి తిప్పాడు. అదేవిధంగా బాపట్ల నుంచి నెల్లూరు జిల్లా దగదర్తి దగ్గర రొయ్యల తలకాయ లోడుతో వెళ్తున్న ఐషర్ లారీ కంటైనర్‌ను ఢీకొని బోల్తా కొట్టింది. దీంతో బీహార్‌కు చెందిన లారీ డ్రైవర్ బాబులకుమార్ (30) తీవ్ర గాయాలయి. వైద్యశాలకు తరలించగా అక్కడ చికిత్స



మృతిచెందిన బాబులకుమార్



ప్రమాదంలో దెబ్బతిన్న ఐషర్ లారీ

పొందుతూ మతి చెందాడు. చిత్తూరు జిల్లా కుప్పంకు చెందిన కంటైనర్ డ్రైవర్ శ్రీనివాసులు తీవ్ర గాయాలయి. క్షతగాత్రుడిని ఒంగోలు తరలించారు. హైవే మొబైల్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని జాతీయ రహదారిపై రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టారు. స్థానిక ఎస్ఐ టి.శ్రీరామ్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాడు.



మాట్లాడుతున్న డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కెఎఫ్.బాబు

డివైఎఫ్ఐ జిల్లా కార్యవర్గ సమావేశం

ప్రజాశక్తి- కొత్తపట్నం

ఇటీవల నిర్వహిస్తున్న గ్రూపు-2 పరీక్ష ప్రశ్నాపత్రం కఠినంగా ఉందని, ఈ నేపథ్యలో మెయిన్స్‌కు 1:50కి బదులుగా 1:100 ఎంపిక చేయాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కెఎఫ్.బాబు డిమాండ్ చేశారు. భారత ప్రజాతంత్ర యువజన సమైక్య జిల్లా కార్యవర్గ సమావేశం కొత్తపట్నంలో గురువారం నిర్వహించారు. ఈ సమావేశానికి డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కెవి. పిచ్చయ్య అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కెఎఫ్. బాబు మాట్లాడుతూ చాలా కాలం తర్వాత నిర్వహించిన గ్రూపు-2 ప్రిలిమినరీ పరీక్షకు తగినంత సమయాన్ని ఇవ్వలేదని తెలిపారు. ప్రిలిమినరీ పరీక్షలో భారత సమాజం సిలబస్‌కు పాఠ్యపుస్తకాలు అందుబాటులో లేవన్నారు. అదే సమయంలో ప్రిలిమినరీ పరీక్షలో మెంటల్ ఎబిలిటి విభాగ ప్రశ్నలు కఠినంగా ఉన్నట్లు తెలిపారు. దీంతో పరీక్ష రాసేందుకు అభ్యర్థులకు సమయం సరి పోలేదన్నారు. ఈ కారణాల దష్ట్యా ప్రిలిమినరీ నుంచి మెయిన్స్ కు 1:100 ఎంపిక చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సంద ర్భంగా జిల్లాకు ప్రకటించిన కనిగిరిలో నిమ్జ్, దొనకొండలో పారిశ్రామిక అభివద్ధి, నిర్మాణం ఆగిపోయిన దర్శి డ్రైవింగ్ స్కూల్, చీమకుర్తి శిల్పారామం, ఒంగోలు యూని వర్సిటీ , ట్రిపుల్ ఐటి కళాశాలకు సొంత భవనాలను నిర్మాణాన్ని పూర్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి పి.నరేంద్ర, జిల్లా ఉపాధ్యక్షుడు పి. కిరణ్ పాల్గొన్నారు



వైఎస్ఆర్ క్రాంతి పథకం కార్యాలయం

సమయ పాలన పాటించని అధికారులు

ప్రజలకు తప్పని తిప్పలు

ప్రజాశక్తి- హనుమంతునిపాడు

వైఎస్ఆర్ క్రాంతి పథకం కార్యాలయ సిబ్బంది ప్రజలకు అందులో ఉండటం లేదు. దీంతో ప్రజలు వివిధ పనుల నిమిత్తం కార్యాలయం వద్దకు వచ్చి అధికారులు లేకపోవడంతో నిరాశతో వెనుదిరుగుతున్నారు. బుధవారం మధ్యాహ్నం 12 గంటల వరకూ అధికారులు రాలేదు. స్వీపర్ మాత్రమే కార్యాలయం తలుపులు తెరచి అధికారులు కోసం వేసి ఉంది. చాలా కాలంగా అధికారులు సకాలంలో కార్యాలయానికి రావడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఎపిఎం నెలలో ఒకటి,రెండు సార్లుమాత్రమే వచ్చి పోతున్నట్లు ప్రజలు చెబుతున్నారు. ఆయన ఫోన్‌కు కూడా అందుబాటులో ఉండటం లేదని చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సిబ్బంది సకాలంలో విధులకు హాజరయ్యేలా చూడాలని ప్రజల కోరుతున్నారు.

రికవరీ కోసం వెళ్లాం : సిసిలు

వైఎస్ఆర్ క్రాంతి పథకం కార్యాలయంలో పనిచేస్తున్న సిసిలను 12 గంటల వరకూ కార్యాలయం తలుపులు తెరవని విషయం గురించి వివరణ కోరగా తాము మండల పరిధిలోని తిమ్మారెడ్డిపల్లి పొదుపు సంఘాల రికవరీ కోసం వెళ్లినట్లు తెలిపారు.

హత్యా యత్నం కేసులో నిందితుడికి ఐదేళ్ల జైలు

ప్రజాశక్తి - మార్కాపురం రూరల్

తల్లీ,కొడుకుపై హత్యాయత్నానికి పాల్పడిన కేసులోని ముద్దాయికి ఐదు సంవత్సరాల జైలు శిక్ష, రూ.500 జరిమానా విధిస్తూ మార్కాపురం అసిస్టెంట్ సెషన్స్ కోర్టు జడ్జి బి.దేవేంద్ర రెడ్డి గురువారం తీర్పు చెప్పారు. అందిన వివరాల ప్రకారం... కొమరోలు మండలం పి.పొట్టిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన ప్రొద్దుటూరి శివ, అతని తల్లి కాశమ్మపై అదే గ్రామానికి చెందిన వారి బంధువు గుంతపల్లి చిన్న బాదరయ్య కుటుంబ తగాదాలను మనసులో పెట్టుకొని ఇనుప రాడ్డుతో కొట్టి గాయపరిచాడు. మళ్లీ 17.3.2018న వారిని కత్తితో పొడిచి హత్యాయత్నానికి ప్రయత్నించాడు. ఈ ఘటనపై కొమరోలు పోలీస్‌స్టేషన్‌లో పలు సెక్షన్లల క్రింద అప్పటి ఎస్ఐ షేక్ అబ్దుల్ రెహమాన్ కేసు నమోదు చేశారు. సమగ్ర దర్యాప్తు చేపట్టి, ముద్దాయిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపాడు. కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. అడిషినల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ దొండపాటి గాంధీ రెడ్డి ప్రాసిక్యూషన్ తరుపున వాదించారు. నేరం రుజువు కావడంతో జడ్జి జైలు శిక్ష, జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. సరైన సాక్ష్యాధారాలు కోర్టులో ప్రవేశపెట్టి సమర్ధవంతంగా ట్రయిల్ మానిటరింగ్ చేసి నిందితుడి శిక్షపడేలా కృషి చేసిన ప్రస్తుత మార్కాపురం టౌన్ ఎస్ఐ షేక్ అబ్దుల్ రెహమాన్, ఎంపిపి దొండపాటి గాంధీ రెడ్డి, కోర్టు లైజన్ ఆఫీసర్ ఐ.వి.శ్రీనివాసరావు, మార్కాపురం టౌన్ ఎఎస్ఐ మునాఫ్, కొమరోలు పోలీస్‌స్టేషన్‌కు చెందిన కోర్టు కానిస్టేబుల్ బి.అంజినాయక్‌ను ఎస్పి పి. పరమేశ్వర రెడ్డి అభినందించారు.



వైద్యశాలలో పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారి డాక్టర్ రాజ్యలక్ష్మి

వైద్యశాల సందర్శన

ప్రజాశక్తి-శింగరాయకొండ

పల్స్‌పోలియో కార్యక్రమంలో భాగంగా ఈనెల 3న చిన్నారులకు పోలియో చుక్కలు వేయనున్నారు. అందులో భాగంగా జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఎస్.రాజ్యలక్ష్మి శింగరాయకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా వ్యాక్సిన్ క్యారీలు ఉన్నాయా లేదా సరిపడా స్టాఫ్ ఉన్నారా యాక్షన్ ప్లాన్ కరెక్ట్‌గా ఉందా హెచ్ఆర్ఎ ఐడెంటిఫై చేశారా లేదా అనే విషయాలు పరిశీలించి సంతప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పల్స్ పోలియో కార్యక్రమాన్ని సజావుగా నిర్వహించి ప్రతి చిన్నారికీ పోలియో చుక్కలు వేసేలా చూడాలన్నారు.. ఈ కార్యక్రమంలో డాక్టర్ చైతన్ కృష్ణ, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ సాంబశివరావు , డాక్టర్ ఉజ్వల, డాక్టర్ శ్రీధర్ రీనా రఫీల్ ,ఆరోగ్య పర్యవేక్షకుడు సయ్యద్ మసూద్ అలీ, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

సిఐకి పొగాకు రైతుల ఫిర్యాదు

కొండపి : గుర్తుతెలియని వ్యక్తులు రాత్రిపూట పొగాకు తోటలలోని పండు ఆకులను రాత్రి పూట దొంగతనంగా రెలుపుకొని పోతున్నారని, నిందితులను గుర్తించి చర్యలు తీసుకోవాలని కోరుతూ రైతులు కొండపి సర్కిల్ సిఐ పాండు రంగారావు గురువారం ఫిర్యాదు చేశారు. తాము లక్షలాది రూపాయలు ఖర్చు చేసి పొగతోటలు సాగు చేసినట్లు తెలిపారు. కూలీలలు దొరకపోవడంతో పొగాకు ఎండిపోతున్నట్లు తెలిపారు. అయితే గుర్తుతెలియని వ్యక్తులు బైకులు, ఆటోల్లో రాత్రి పూట పండు ఆకులను రెలుపుకు పోతున్నట్లు తెలిపారు. దీంతో స్పంతదించిన సిఐ మాట్లాడుతూ పండుఆకులు రెలుపుకు పోతున్న నిందితులను గుర్తించి తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.


సిద్ధం సభ భోజన ఏర్పాట్లు పరిశీలిస్తున్న బాబు

సిద్ధం సభకు ఏర్పాట్లు

ప్రజాశక్తి - వేమూరు
అద్దంకి నియోజకవర్గం కొరిశపాడు మండలం పిచ్చుకల గుడిపాడులో జరగనున్న సిద్ధం సభకు వేమూరు నియోజకవర్గం నుండి 500బస్సుల ద్వారా 25వేల నుండి 30వేల వరకు జనాన్ని తరలించనున్నట్లు వైసిపి వర్గాలు తెలిపాయి. తరలి వెళ్లే ప్రజలకు ఎలాంటి ఇబ్బంది జరగ కుండా అవసరమైన భోజన వసతి కొరకు చీరాల సమీపం లో 216జాతీయ రహదారి ప్రక్కన ఐదు ఎకరాల ఖాళీ భూమిని వేమూరు వైసిపి ఇన్చార్జి వరికూటి అశోక్ బాబు, వరికూటి అమృతపాణి పరిశీలించారు. ప్రజల తరలింపుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.


విద్యార్థులకు బహుమతులు ఇస్తున్న ఉపాధ్యాయులు

ఘనంగా విజ్ఞాన దినోత్సవం

ప్రజాశక్తి - భట్టిప్రోలు
మండలంలోని వెల్లటూరు జెడ్‌పి ఉన్నత పాఠశాల్లో 28, 29 తేదీల్లో ఘనంగా విజ్ఞాన దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులచే రూపొందించిన వివిధ రకాల విజ్ఞాన పరికరాలను ప్రదర్శించారు. వీటిని పాఠశాల విద్యార్థులతో పాటు వివిధ పాఠశాలల నుండి అనేక మంది విద్యార్థులు వీక్షించారు. పాఠశాల హెచ్ఎం కర్ర కుమారి పర్యవేక్షణలో సైన్స్ డే పురస్కరించుకొని సైన్స్ ప్రాధాన్యత ను వివరించారు. మానవ మనుగడ సైన్స్ తో ముడిపడి ఉందని అన్నారు. మూఢనమ్మకాలు వీడి సైన్సును ప్రతి ఒక్కరు ఆదరించి తద్వారా భవిష్యత్తులో జరగనున్న అంశాల ను శాస్త్రీయంగా వెలికి తీసేందుకు సైన్స్ దోహద పడుతుందని పేర్కొన్నారు. విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి బహుమతి అందజేశారు.


బూత్ మల్లి గ్రామస్తులతో అశోక్ బాబు

అశోక్‌బాబు సమక్షంలో వైసీపీలో చేరిక

ప్రజాశక్తి - వేమూరు
మండలంలోని బూతుపల్లి గ్రామం నుండి టిడిపికి చెందిన 25గిరిజన కుటుంబాలు వైసిపి ఇన్‌ఛార్జి వరికూటి అశోక్‌బాబు సమక్షంలో గురువారం వైసీపీలో చేరారు. వారికి వైసిపి కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న నవరత్నాల పథకాలతో పేదలకు సంక్షేమ పథకాలు ఎంతో దోహద పడుతున్నాయని అన్నారు. వీటికి ఆకర్షితులై టిడిపి నుండి వైసీపీలో పని చేయాలని నిశ్చయించుకున్నట్లు పేర్కొన్నారు. అశోక్ బాబు మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి పార్టీలో గుర్తింపు లభిస్తుందని అన్నారు. అర్హులైన పేదలందరికీ మధ్యవర్తుల ప్రమేయం లేకుండా సంక్షేమ పథకాలు అమలు చేసినట్లు చెప్పారు. విద్యాదీవెన, వసతి దీవెన, ఆసరా, రైతు భరోసా ఇలా ప్రతి కుటుంబానికీ ఏదో ఒక పథకం ద్వారా మేలు జరిగిందని అన్నారు. సంక్షేమం ఇలాగే కొనసాగాలంటే రాను ఎన్నికల్లో వైసీపీ గెలుపే లక్ష్యంగా పనిచేసి మరో మారు జగన్మోహన్‌రెడ్డిని సిఎంగా గెలిపించుకోవాల్సిన బాధ్యత ఉందని సూచించారు. ప్రతిపక్షాలు ఎన్ని ఏకమైనా జగన్మోహన్‌రెడ్డిని ఎదుర్కొనలేరని అన్నారు. గ్రామాల్లో పేదలకు పెత్తందారులకు మధ్య యుద్ధం అన్నారు.

త్వరలో చలివేంద్రాలు ఏర్పాటు

ప్రజాశక్తి - రేపల్లె
రానున్న వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు అవసరమైన ప్రదేశాల్లో మజ్జిగను ఏర్పాటు చేస్తున్నట్లు మున్సిపల్ చైర్ పర్సన్ కట్ట మంగ తెలిపారు. స్థానిక కౌన్సిల్ హాల్ నందు గురువారం జరిగిన కౌన్సిల్ అత్యవసర సమావేశం లో ఆమె మాట్లాడారు. పట్టణంలోని అంకమ్మ చెట్టు, ఆజాద్ ఉర్దూ స్కూల్, తహశీల్దారు కార్యాలయం, మున్సిపల్ ఆఫీస్, బస్టాండ్ సెంటర్, లక్ష్మీ టాకీస్ సెంటర్, బేతపూడి సెంటర్, జగనన్న కాలనీ, వేపాలమ్మ చెట్టు వద్ద చలివేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. మున్సిపల్ వైస్ చైర్మన్ గుజ్జర్లమూడి ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ నూతనంగా బాధ్యతలు చేపట్టిన కమిషనర్ బిఆర్ శేషాద్రిని సభ్యులకు పరిచయం చేశారు.


మున్సిపల్ చైర్ పర్సన్ కట్ట మంగ

పట్టణంలో రూ.47.40లక్షలతో రాను న్న నెల్లో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టుతున్నామని తెలిపారు. అందులో భాగంగానే చలివేంద్రాల ఏర్పాటుకు రూ.5లక్షలు, రానున్న సార్వత్రిక ఎన్నిక ల్లో పోలింగ్ బూతుల వద్ద ఓటరుకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా మౌలిక సదుపాయాలు కల్పించుటకు రూ.5లక్షలు, పట్టణంలో మురుగు నీటి పారదల నిమిత్తం సిసి డ్రైన్లకు రూ.12.45లక్షలు, సీసీ రోడ్లకు రూ.19లక్షలు, వేసవిని దృష్టిలో ఉంచుకొని ట్యాం కర్ల ద్వారా అవసరమైన వార్డుల్లో మంచినీటిని సరఫరా చేసేందుకు రూ.6లక్షలు కేటాయించినట్లు తెలిపారు. అజెండాలో పొందుపరిచిన 27అంశాలను ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. కమిషనర్ బిఆర్ శేషాద్రి, మేనేజర్ బివిఎస్ శేఖరరావు, ఎఇ రోహిణి పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి - చీరాల
వైసీపీ ప్రభుత్వంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని వైసిపి ఇన్చార్జి కరణం వెంకటేష్ బాబు అన్నారు. మండలంలోని ఈపూరుపాలెం సచివాలయం-2 సిండికేట్ కాలనీ వద్ద గురువారం జరిగిన గడప గడప కు మన ప్రభుత్వం కార్యక్రమంలో లబ్ధిదారులతో నేరుగా కలిసి జగనన్న ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను వివరిం చారు. అర్హులైన వారందరూ సంక్షేమ పథకాలకు దరఖా స్తులు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శోభారాణి, ఏపీఎం సుబ్బారావు, అర్బన్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ గవిని శ్రీనివాసరావు, మల్లెల లలితరాజశేఖర్, వైసిపి మండల అధ్యక్షులు ఆసాది అంకాలరెడ్డి, చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, బిట్రా శ్రీని


పత్రాలు అందజేస్తున్న ఇన్చార్జి కరణం వెంకటేష్

వాసరావు, నల్లబోతుల రాజ్ కుమార్, మేడా వెంకట్రావు, బుర్ల మురళీకృష్ణ, పర్వతనేని శ్రీనివాసరావు, బక్కా అద్దంకిరెడ్డి, పిక్కి నారాయణ, మారుబోయిన ప్రేమ్ చంద్ రెడ్డి, చప్పిడి రామచంద్ర, తేళ్ల రాంబాబు పాల్గొన్నారు.

రామ్మోహనరావుకు సత్కారం

ప్రజాశక్తి - భట్టిప్రోలు
భట్టిప్రోలు పంచాయతీలో పారిశుద్ధ్య కార్మికులుగా పనిచేసిన రామ్మోహనరావు ఉద్యోగ విరమణ వీడ్కోలు సభ గురువారం నిర్వహించారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వీడ్కోలు సభలో రామ్మో హనరావు దంపతులను సర్పంచి ధార కిరణ్మయి, కార్య దర్శి కోట శ్రీనివాసరావు శాలువతో సత్కరించి శుభాకాం క్షలు తెలిపారు. ఈ సందర్భంగా జరిగిన సభకు కార్యదర్శి అధ్యక్షత వహించగా సర్పంచ్ మాట్లాడుతూ రామ్మోహన రావు ఎన్నో ఏళ్లగా పంచాయతీలో కార్మికులుగా పనిచేసి గ్రామస్తులకు సేవలు చేశారని కొనియాడారు. రామ్మోహ నరావు శేష జీవితం సుఖ సంతోషాలతో వెలగాలని


రామ్మోహనరావు దంపతులకు సన్మానం

ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ బూరెలు రాంప్రసాద్, పాలకవర్గ సభ్యులు కుక్కల భూషణరావు, అబ్దుల్లా, బట్టు మల్లికార్జునరావు పాల్గొన్నారు.

వైసీపీకి శ్రీనివాసరెడ్డి రాజీనామా

ప్రజాశక్తి - పంగులూరు
మండల ప్రజా పరిషత్ ఉపాధ్యక్షులు, వైసీపీ మండల కన్వీనర్ ఎర్రం శ్రీనివాసరెడ్డి వైసీపీకి రాజీనామా చేశారు. వైసీపీ జిల్లా అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణకు రాజీనామా లేఖను పంపారు. టిడిపి మండల నాయకులు కుక్కపల్లి ఏడుకొండలు, చింతల సహదేవుడు, బొరెడ్డి ఓబుల్ రెడ్డిలతో కలిసి చిలకలూరి పేటలోని ఎంఎల్ఎ గొట్టిపాటి రవికుమార్ నివాసానికి వెళ్లి ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి సంఘీభావం తెలిపారు. శ్రీనివాసరెడ్డి మాజీ శాసనసభ్యుడు గరట య్యకు చాలా కాలం నుండి శిష్యునిగా ఉన్నాడు. గరట య్య వైసీపీలో చేరినప్పటి నుండి ఆయన వెంటే ఉన్నాడు. వైసిపి మండల కన్వీనర్‌గా, మండల పరిషత్ ఉపాధ్యక్షు లుగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. అయితే మారిన రాజకీయ పరిస్థితుల కారణంగా తాను ఇక వైసీపీలో


ఎంఎల్ఎ గొట్టిపాటి రవికుమార్‌తో ఎర్రం శ్రీనివాసరెడ్డి

ఉండలేనని నిర్ణయించుకొని టిడిపి వైపు మొగ్గు చూపాడు. గరటయ్య ఆయన కుమారుడు కృష్ణ చైతన్య కూడా ఇంతకుముందే వైసీపీకి రాజీనామా చేసి టిడిపి అధినేత నారా చంద్రబాబును కలిసి సంఘీభావం తెలిపారు. శ్రీనివాసరెడ్డి కూడా ఎమ్మెల్యే రవికుమార్ దగ్గరికి వెళ్లి మర్యాదపూర్వకంగా కలవడం ఇప్పుడు రాజకీయ చర్చకు దారితీసింది.

చీరాల డిఎస్పిగా బేతపూడి ప్రసాద్

ప్రజాశక్తి - చీరాల
డిఎస్పీగా నియమితులైన బేతపూడి ప్రసాద్ గురువారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఆయన ఇంటలిజెన్స్ డిఎస్పీగా ఉంటూ బదిలీపై వచ్చారు. ఇప్పటివరకు డిఎస్పీగా ఉన్న ప్రసాదరావును ఇంటలిజెన్స్ డిఎస్పీగా



డిఎస్పీ ప్రసాద్

బదిలీ చేశారు. 2019 ఎన్నికల సమయంలో బేతపూడి ప్రసాద్ చీరాల టూ టౌన్ సీఐగా పని చేశారు. ఈ నేపథ్యంలో ఆయనకు చీరాల నియోజకవర్గంపై పూర్తి అవగాహన ఉంది. ఈసందర్భంగా ఆయనకు కార్యాలయ సిబ్బంది, సీఐలు, ఎస్ఐలు అభినందనలు తెలిపారు.



దరఖాస్తు పత్రాన్ని అందిస్తున్న దేవరపల్లి బ్లాండీనా

'కాంగ్రెస్'కు దేవరపల్లి దరఖాస్తు

ప్రజాశక్తి - చీరాల
కాంగ్రెస్ అసెంబ్లీ అభ్యర్థిగా పోటీ చేసేందుకు దేవరపల్లి బ్లాండిన గురువారం దరఖాస్తు చేసుకున్నారు. కాంగ్రెస్ విజయవాడ కేంద్ర కార్యాలయంలో దరఖాస్తు పత్రాలను కాంగ్రెస్ ఇన్చార్జి దేవరపల్లి రంగారావు సమక్షంలో సమర్పించారు. కాంగ్రెస్‌తో తమ కుటుంబానికి సుదీర్ఘ అనుబంధం ఉందని అన్నారు. అదేవిధంగా గతంలో భర్త దేవరపల్లి రంగారావు 2019లో ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసినప్పుడు కాంగ్రెస్ తరపున ప్రచారకర్తగా పనిచేసి చీరాల ప్రజలతో సన్నిహిత సంబంధాలను పెంచుకున్నట్లు తెలిపారు. తాను సమర్పించిన అభ్యర్థనను అధిష్ఠానం మనస్ఫూర్తిగా స్వీకరించి చీరాల అసెంబ్లీ సీటు కేటాయించాలని కోరారు.


కార్మికులకు వస్తువులు పంపిణీ చేస్తున్న సర్పంచ్ రవికిరణ్మయి

కార్మికులకు అలవెన్స్ అందజేత

ప్రజాశక్తి - భట్టిప్రోలు
భట్టిప్రోలు పంచాయతీలో పారిశుద్ధ్య కార్మికులకు ఎట్టకేలకు మూడేళ్ల తర్వాత వివిధ రకాల అలవెన్సులను గురువారం అందజేశారు. పంచాయతీ పాలకవర్గం ఏర్పడిన తరువాత తొలిసారిగా ఎక్కడ లేని విధంగా పెద్ద మొత్తంలో అలవెన్సులు కార్మికులకు ముట్ట చెప్పారు. పంచాయతీలో పనిచేస్తున్న 30మంది కార్మికులకు ఒక్కొక్కరికి 24 సబ్బులు, రెండు జతల చెప్పులు, మూడు కొబ్బరినూనె సీసాలు, గ్లౌజులు, యూనిఫామ్ దుస్తులు అందజేశారు. వీటిని సర్పంచ్ ధారా రవికిరణ్మయి, కార్యదర్శి కోట శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ బర్లే రాంప్రసాద్, పాలకవర్గ సభ్యుల చేతుల మీదగా అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికులకు ప్రతి ఏట అందించా ల్సిన ఈ పాలవెన్స్‌ల పంపిణీలో కొంత జాప్యం జరిగిందని అన్నారు. అయినాప్పటికీ కార్మికుల సేవలను దృష్టిలో ఉంచుకొని వారికి ఏడాదికి సరిపోయే విధంగా సుమారు రూ.1.90లక్షల వ్యయంతో వీటిని అందజేస్తున్నట్లు తెలిపారు. కార్మికులకు వేతనాలు కూడా ఎలాంటి ఇబ్బంది లేకుండా సకాలంలో అందిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో చెన్నయ్య, భూషణరావు పాల్గొన్నారు.


వృద్ధాశ్రమానికి బియ్యం అందజేస్తున్న దాతలు

బియ్యం పంపిణీ

ప్రజాశక్తి - పర్చూరు
స్థానిక నేతాజీ వృద్ధాశ్రమానికి యద్దనపూడి వాసవి క్లబ్ క్వింటా బియ్యాన్ని బహూకరించారు. లీపు సంవత్సరం చివరి రోజు 29న ప్రతి ఒక్కరు దానం చేయాలన్న వాసవి క్లబ్ ఆదేశాల మేరకు వృద్ధాశ్రమంలో దాన ధర్మాలు చేసినట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. వృద్ధాశ్రమానికి సమీపంలో ఉన్న మరో పేద కుటుంబానికి 25కేజీల బియ్యాన్ని అందించారు. ఏ ఆసరా లేని వృద్ధులను ఆదుకునేందుకు ముందుకు రావడం అభినందనీయమని అన్నారు. వాసవీ సేవా కార్యక్రమాల్లో ఆసక్తి కలిగిన వాళ్లు భాగస్వాములు కావాలని కోరారు. వాసవీ సేవా కార్యక్రమాలు విస్తృతం చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో యద్దనపూడి వాసవి క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షులు పోలిశెట్టి హనుమంతరావు, ప్రస్తుత అధ్యక్షులు దారా బాలసుబ్బారావు, కార్యదర్శి కొత్తూరి వెంకట రాంబాబు, ట్రెజరర్ పోలిశెట్టి బసవయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వై.వెంకటేశ్వర్లు

విద్యారంగ సమస్యలు పరిష్కరించడంలో

రాష్ట్ర ప్రభుత్వం విఫలం

ఎస్‌ఎఫ్‌ఐ అఖిల భారత మాజీ అధ్యక్షులు వై.వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి-కొత్తపట్నం

విద్యారంగ సమస్యలు పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని ఎస్ఎఫ్ఐ అఖిల భారత మాజీ అధ్యక్షులు వై.వెంకటేశ్వర్లు విమర్శించారు. భారత విద్యార్థి ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ సమావేశం గురువారం కొత్తపట్నం లోని నల్లూరి గార్డెన్స్‌లో రాష్ట్ర అధ్యక్షులు కె.ప్రసన్న కుమార్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వై.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఐదేళ్ల పరిపాలనా కాలంలో విద్యారంగ సమస్యలను గాలికి వదిలేసిందన్నారు. పథకాల పేరుతో ఆర్భాటపు ప్రచారమే తప్ప ఆచరణలో విద్యారంగాన్ని పట్టించుకోలేదని అన్నారు. జీవో నెంబర్ 77 తీసుకొచ్చి ఉన్నత విద్యకు రీయంబర్స్‌మెంట్ రద్దు చేశారన్నారు. ఎస్సీ, ఎస్టీ ,బీసీ మరియు పేద విద్యార్థులకు ఉన్నత విద్యను దూరం చేశారన్నారు. రూ.1650 కోట్లు కాలేజీలకు రాష్ట్ర ప్రభుత్వం బాకీ పడిందని తెలియజేశారు. సంక్షేమ హాస్టళ్లు సంక్షోభంలో వున్నాయని, సిబ్బంది కొరత తీవ్రంగా వుందని, ఆరు నెలల నుండి మెస్ కాస్మోటిక్ ఛార్జీలు పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. అప్పుల ఊబిలో హాస్టళ్లు కూరుకుపోయాయని దుయ్యబట్టారు. ఈ ప్రభుత్వ హయాంలోనే ఎయిడెడ్ విద్యాసంస్థలను సంపూర్ణంగా మూసేశారని చెప్పారు. కార్పొరేట్ విద్యాసంస్థలకు విచ్చలవిడిగా స్వేచ్ఛను ఇచ్చి దానికి అడ్డుగా ఉన్న ప్రభుత్వ రంగాన్ని ధ్వంసం చేస్తున్నారన్నారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఎ.అశోక్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విద్య కాశాయికరణ, కార్పొరేటీకరణ, ప్రైవేటీకరణ చేయడానికి పూనుకుందన్నారు. దానిని రాష్ట్రంలో అమలు చేయడానికి రాష్ట్రప్రభుత్వం వెంపర్లాడుతుందని తెలిపారు. నూతన విద్యా విధానం పేరుతో ప్రాథమిక విద్యను ధ్వంసం చేశారన్నారు. యూనివర్సిటీల స్థాయిని దిగజార్చి, నిధులను కేటాయించకుండా సంక్షోభంలోకి నెట్టారన్నారు. సమస్యలపై పోరాడే శక్తులపై నిర్బంధాన్ని మోపుతోందని తెలియజేశారు. ఒంగోలు ట్రిపుల్ ఐటి విద్యార్థులు తమ సమస్యలు పరిష్కారం చేయాలని కోరుతూ ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని చెప్పారు. ఈ సమస్యలపై తక్షణం ప్రభుత్వం దష్టి సారించాలని తెలిపారు. కేంద్రంలోని బిజెపి, రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ విద్యారంగంపై తీవ్రమైన దాడి చేశాయని చెప్పారు. దీనికి వ్యతిరేకంగా విద్యార్థులు పోరాటం చేయాలని రాష్ట్ర కమిటీ సభ్యులకు పిలుపునిచ్చారు. సమావేశంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు సిహెచ్.వినోద్, రామ్మోహన్, యల్.జె.నాయుడు, పావని, రాష్ట్ర సహాయ కార్యదర్శులు వెంకటేశ్వర్లు, పరమేష్, అబ్దుల్లా, జాహిదా పాల్గొన్నారు.

ఆక్వా రైతులకు అనుకూలంగా

కోస్టల్ ఆక్వా కల్చర్ అథారిటీ నిర్ణయాలు

మత్స్యశాఖ అధికారి సురేష్

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా



సురేష్

కేంద్ర ప్రభుత్వం కోస్టల్ ఆక్వా కల్చర్ అథారిటీ చట్టం 2005 కు ఆగస్టు 2023న సవరణ చేయడం జరిగిందని, దీనికి సంబంధించిన నూతన మార్గదర్శకాల్లో భాగంగా ఆక్వారైతులకు అనుకూలంగా ఉండే నిర్ణయాలు తీసుకోవడం జరిగిందని జిల్లా మత్స్య అధికారి సురేష్ తెలిపారు. ఈ కొత్త నిబంధనలు జనవరి 2024 నుంచి అమల్లోకి రావడం జరిగిందన్నారు. ఈ చట్టంలోని ముఖ్య అంశాలను వివరించారు. ఆక్వా చెరువుల విస్తీర్ణం 5 హెక్టార్ల వరకు రెవెన్యూ డివిజనల్ అధికారి అధ్యక్షతన గల కమిటీ రిజిస్ట్రేషన్ చేసేందుకు కోస్టల్ ఆక్వా కల్చర్ అథారిటీకి సిఫార్సు చేయవచ్చు. ఐదు హెక్టార్ల నీటి విస్తరణ కంటే ఎక్కువ ఉన్న చెరువులు జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలోని జిల్లా స్థాయి కమిటీ కోస్టల్ ఆక్వా కల్చర్ అథారిటికి సిఫార్సు చేయవచ్చు. అసైన్డ్ భూముల మరియు సొసైటీ భూముల్లో ఉన్న చెరువులకు రిజిస్ట్రేషన్ సదుపాయం కల్పించారు. గతంలో పై చట్టం కింద ఉప్పు నీటి చెరువులుగా నమోదు కాబడి, కాల పరిమితి అయిపోయిన పాత చెరువులకు తిరిగి లైసెన్సులను పెనాల్టీ కట్టి పునరుద్ధరించుకోవచ్చు. ఉప్పునీటి చెరువుల లైసెన్సులకు సంబంధించి కాగితం పోగొట్టుకున్న వారికి నకలు పొందే సదుపాయం కల్పించబడింది. ఆక్వా చెరువులను కొనుగోలు చేసే రైతుల పేరుమీద లైసెన్స్ లను బదిలీ చేసుకోవచ్చు. గతంలో అనధికారికంగా ఉప్పునీటి చెరువులు చేస్తున్న రైతులకు లక్ష రూపాయలు అపరాధ రుసుము మరియు మూడు సంవత్సరాలు జైలు శిక్ష వేసే అవకాశం ఉండేది. కానీ ప్రస్తుత చట్టంలో అనధికారికంగా ఉప్పునీటి చెరువులు చేస్తే జరిమానా విధిస్తారు. ఉప్పునీటి రొయ్య పిల్లలు లేదా చేప పిల్లల హేచరీల వారు అనధికారంగా ఉత్పత్తి చేస్తే అపరాధ రుసుం విధిస్తారు.ఈ విషయాలపై ఆక్వా రైతులకు హెచరీల యజమానులకు మరి ఆక్వా మందుల షాపు యజమానులు ఇతర భాగ స్వాములు అందరికి కూడా అవగాహన కల్పించేందుకు మార్చి 1 తేదీన మధ్యాహ్నం 3 గంటలకు కర్లపాలెం లోని వాసవి కళ్యాణ మండపంలో సమావేశం ఏర్పాటు చేసినట్లు జిల్లా మత్స్య అధికారి పి సురేష్ తెలిపారు.

నాలుగు నెలల్లో..

షాదీఖానా నిర్మాణం పూర్తి చేస్తాం..

ఎమ్మెల్యే అన్నా రాంబాబు

ప్రజాశక్తి-మార్కాపురం



మాట్లాడుతున్న అన్నా రాంబాబు

మార్కాపురం పట్టణంలో నిర్మాణంలో ఉన్న షాదీఖానా మరో నాలుగు నెలల్లో పూర్తి కానుందని గిద్దలూరు ఎమ్మెల్యే, మార్కాపురం వైసిపి సమన్వయకర్త అన్నా వెంకట రాంబాబు పేర్కొన్నారు. గురువారం సాయంత్రం నిర్మాణంలో ఉన్న షాదీ ఖానాను సందర్శించారు. అనంతరం ఆయన ముస్లిం పెద్దలతో కలిసి విలేకరులతో మాట్లాడారు. నాడు వైఎస్ రాజశేఖరెడ్డి షాధీఖానా అవసర మని పట్టణ నడిబొడ్డున స్థలం కేటాయించడం జరిగిందన్నారు. నేడు ఆయన తనయుడు సిఎం జగన్‌మోహన్‌రెడ్డి పూర్తి చేస్తున్నారని చెప్పారు. ఇప్పటివరకు రూ. 30లక్షల వ్యయంతో పనులు జరిగాయన్నారు. రూ.2 కోట్లతో షాధీఖానా నిర్మాణం జరుగుతోందని చెప్పారు. అనంతరం అక్కడ ఉన్న మున్సిపల్ డిఇ షేక్ సుభానీ, ఎఇ పి.ఆదినారాయణరెడ్డి, కాంట్రాక్టర్ భీమవరం వెంకటేశ్వరరెడ్డిలతో మాట్లాడారు. వీలైనంత త్వరగా నిర్మాణం పూర్తయ్యేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ డాక్టర్ మీర్జా షంషీర్ అలిబేగ్, మున్సిపల్ చైర్మన్ చిర్లంచెర్ల బాలమురళీ క్రిష్ణ, మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ ఇస్మాయిల్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ షెక్షావలి, వైసిపి పట్టణ ప్రచార కమిటీ అధ్యక్షులు మయూర్ ఖాశిం, వైసిపి కౌన్సిలర్లు మొఘల్ సిరాజ్‌తుల్లా బేగ్, డి.కరిముల్లా, వైసిపి నాయకులు డాక్టర్ షేక్ మక్బుల్‌బాష తదితరులు పాల్గొన్నారు.

12వ పీఆర్సీని ప్రకటించాలని ధర్నా

ప్రజాశక్తి-దర్శి

ఉద్యోగ, ఉపాధ్యాయులకు 12వ పీఆర్సీని ప్రభుత్వం వెంటనే ప్రకటించాలని, ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు వాకా జనార్ధన్‌రెడ్డి అన్నారు. గురువారం తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జనార్ధన్‌రెడ్డి మాట్లాడుతూ సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని, అప్రంటీస్ విధానాన్ని రద్దుచేయాలని, పెండింగ్‌లో ఉన్న డీఏలను మంజూరు చేయాలని, మెడికల్ బిల్లులు, ఏపీసీఎల్ఐ, అరియర్స్ మంజూరు చేయాలని కోరారు. అనంతరం ఎమ్మార్వో జి.సుజాతకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు ప్రసాద్, కోటేశ్వరరావు, రంగస్వామి, రాఘవరావు, మస్తాన్‌వలి, కరిముల్లా, రవితేజ, శ్రీనివాసులు, రామకృష్ణ, రమణయ్య, డీవీ రమణారెడ్డి, నారాయణ పాల్గొన్నారు.

వైఎస్.షర్మిలను కలిసిన కృష్ణారెడ్డి

ప్రజాశక్తి-దర్శి

ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు వై.షర్మిలను గురువారం విజయవాడలో జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కైపు వెంకటకృష్ణారెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. యువత ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. దొనకొండలో పారిశ్రామిక కేంద్రాన్ని ప్రారంభించేలా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని కోరారు.

స్పోర్ట్స్ అకాడమీ ప్రారంభం

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్



స్పోర్ట్స్ అకాడమీని ప్రారంభిస్తున్న దృశ్యం

స్థానిక పేర్నమిట్ట లింగారెడ్డి కల్యాణ మండపం వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన స్పోర్ట్స్ అకాడమీని రాష్ట్ర మంత్రి మేరుగ నాగార్జున, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో చీరాల ఎమ్మెల్యే కరణం బలరాం, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

సునీత డయాబెటిక్ హాస్పిటల్ ప్రారంభం

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

స్థానిక తాలుకా పోలీసుస్టేషన్ ఎదురుగా నూతనంగా ఏర్పాటు చేసిన సునీత డయాబెటిక్, ఆర్థోపెడిక్ హాస్పిటల్‌ను ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, చీరాల ఎమ్మెల్యే కరణం బలరాం కృష్ణమూర్తి, వైసిపి యువనాయకులు బాలినేని ప్రణీత్‌రెడ్డి, హాస్పిటల్ వైద్యులు డాక్టర్ సునీత, డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

'ఆసరా' ఏదీ?

- మూడు వారాలైనా జమ కాని నగదు
- డ్వాక్రా సంఘాల సభ్యుల ప్రదక్షిణలు
- బటన్ నొక్కినా జమ కాని నిధులు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం



ఆసరా చెక్కు అందజేస్తున్న దృశ్యం (ఫైల్)

డ్వాక్రా మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం నాలుగో విడత వైఎస్ఆర్ ఆసరా పథకం ద్వారా డబ్బులు విడుదల చేస్తున్నట్లు సిఎం జగన్ బటన్ నొక్కారు. అయితే ఈ పథకం కింద చాలా మంది లబ్ధిదారులకు ఇంకా నిధులు జమ కాలేదు. అనంతపురం జిల్లా ఉరవకొండలో జనవరి 29న ప్రత్యేక కార్యక్రమం నిర్వహించి ఆడంబరంగా వైఎస్ఆర్ ఆసరా నిధుల విడుదలకు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి బటన్ నొక్కారు. తమ బ్యాంకు ఖాతాలు పరిశీలించుకున్న డ్వాక్రా సంఘాల సభ్యులకు నగదు జమ కాలేదన్న విషయం తెలుసుకుని ఖంగుతిన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి బటన్ నొక్కి మూడు వారాలు దాటిపోయినా ఇంతవరకు నిధుల విడుదలకు మోక్షం కలగలేదు.

నిధులు విడుదల ఇలా..

జిల్లాలో 31,320 డ్వాక్రా సంఘాలకు రూ.234 కోట్లా 45 లక్షల తొమ్మిది వేల నిధులు విడుదల చేసినట్లు ప్రకటించారు. అలాగే నియోజకవర్గంలోని యర్రగొండపాలెం మండలంలో 658 సంఘాలకు రూ.2 కోట్లా 86 లక్షలా 16 వేలు, పుల్లలచెరువు మండలంలో 410 సంఘాలకు రూ.2 కోట్లా 4 లక్షలా 6 వేలు, త్రిపురాంతకం మండలంలో 603 సంఘాలకు రూ.3 కోట్లా 12 లక్షలా 21 వేలు, పెద్దదోర్నాల మండలంలో 573 సంఘాలకు రూ. 3 కోట్లా 9 లక్షలా 98 వేలు, పెద్దదోర్నాల మండలంలో 551 సంఘాలకు రూ.3 కోట్లా 18 లక్షలా 23 వేలు చొప్పున విడుదల చేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. అయితే ఇప్పటికీ 40 శాతం మంది సభ్యులకు కూడా నిధులు జమ కానట్లు వైఎస్ఆర్ క్రాంతి పథం అధికారులే చెబుతున్నారు. సీఎం బటన్ నొక్కారు కదా నిధులు ఎందుకు జమకాలేదంటూ నిత్యం బ్యాంకులు, యానిమేటర్ల వద్దకు సభ్యులు వెళ్లి ఆరా తీస్తున్నారు. ఆసరా పేరిట నియోకవర్గంలో సంబరాలు సైతం నిర్వహించారు. ఆయా సభలకు స్వయం సహాయక సంఘాల మహిళలను బలవంతంగా తరలించారు. నగదు జమ కాని విషయం తెలుసుకుని ఇంత మాత్రానికి మమ్మల్ని ఎందుకు సభలు, సమావేశాలకు రమ్మంటున్నారంటూ సభ్యులు నిలదీస్తున్నారు. దాదాపుగా అన్ని పథకాల కింద సీఎం బటన్ నొక్కగానే నిధులు జమ కావడం లేదు. కొన్ని సందర్భాల్లో నెలల పాటు సమయం పడుతోంది. వసతి దీవెన, అమ్మఒడి, విద్యాదీవెన తదితర పథకాలకు సైతం వెంటనే నిధులు జమ కావడం లేదు. అవసరమైన నిధులు లేనప్పటికీ సీఎం బటన్ నొక్కేస్తున్నారు. అందుబాటులోకి వచ్చిన తర్వాత జమ చేస్తున్నారు. అందుకే సమయం తీసుకుంటోంది అని అధికారులు చెబుతున్నారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలోనూ నగదు జమ కాకపోవడంపై వైసీపీ నేతలను సభ్యులు ప్రశ్నిస్తుండడంతో గ్రామాల్లోకి వెళ్లడానికి జంకుతున్నారు. నాయకులు సైతం అధికారులను నిధులు విషయమై ఆరా తీస్తున్నారు. వెంటనే తమకు కూడా నిధులు మంజూరు చేయాలని కోరుతున్నారు.

నాణ్యతా లోపంతో ఏడాదికే దెబ్బతిన్న రోడ్డు

ప్రజాశక్తి - పర్చూరు

ప్రధాన మంత్రి గ్రామీణ సడక్ యోజన కింద పాత మద్రాసు రోడ్డుకు అనుసంధానంగా మండలంలోని బోడవాడ, రమణయ్యపాలెం రోడ్డును ఏడాది క్రిందటమే నిర్మించారు. అయితే ఆ రోడ్డు దెబ్బతింటుంది. మరమ్మతులు చేయకపోవడంతో నిర్మాణం పూర్తి అవుతుందా అన్నది ప్రశ్నార్థకంగా మారుతుంది. బోడవాడ నుంచి రమణయ్యపాలెం వరకు 5.7 కిలోమీటర్ల దూరం ఉండగా రోడ్డు అధ్వానంగా ఉండటంతో వ్యవసాయ పనులకు వెళ్లేందుకు రైతులు తీవ్రంగా ఇబ్బంది పడేవారు. ఇలా ఉన్న సమయంలో పీఎంజీఎస్‌వై పథకం కింద రహదారి అభివృద్ధికి ప్రతిపాదన పంపారు. కేంద్ర ప్రభుత్వం ఆమోదించి రూ.3.20కోట్ల నిధులు మంజూరు చేసింది. ఈ నిధులతో గతంలో ఉన్న రోడ్డును చదును చేసి క్వారీ డస్ట్ ఎనిమిది అంగుళాల మందం వేశారు. ఆ తరువాత ఆరంగులాల ఎత్తున జీఎస్బీ దానిపై ఆరంగులాల మందంతో విటమిక్స్ వేశారు. ఆ తరువాత 20ఎంఎం మేర తారు వేసి దానిపై ఓజీపీఈఎస్ కోటింగ్ వేశారు. 2023 ఫిబ్రవరి నుంచి ఈ రోడ్డు అందుబాటులోకి వచ్చింది. దీంతో వాహనాల రద్దీ పెరిగింది. భారీ వాహనాలు తిరగటం వల్ల ఏడు నెలల వ్యవధిలోనే రోడ్డుపై అక్కడక్కడ గుంతలు పడ్డాయి. దీన్ని దృష్టిలో ఉంచుకొని అధిక లోడుతో వెళ్లే వాహనాలను పోకుండా ఉండేందుకు గుత్తేదారు బోడవాడ, రమణాయపాలెం వద్ద ప్రత్యేక ఇనుప ఆర్చీలు ఏర్పాటు చేశారు. లోగడ పర్చూరు నుంచి జిల్లా కేంద్రం బాపట్ల వెళ్లేందుకు వీరన్నపాలెం, ఉప్పుటూరు, పోతుకట్ల, కొమరనేనివారిపాలెం, రమణాయపాలెం గ్రామాల మీదగా చెరుకూరు వెళ్లి అక్కడ నుంచి వెళ్లేవారు. బోడవాడ మీదుగా రమణాయపాలెం రోడ్డు వేయడంతో పర్చూరు నుంచి జిల్లా కేంద్రం బాపట్ల వెళ్లాలనుకునే ప్రయాణికులకు ఎనిమిది కిలోమీటర్ల దూరం తగ్గి బోడవాడ మీదుగా రమణాయపాలెం చేరుకొని అక్కడ నుంచి సులభంగా వెళ్లటానికి అవకాశం ఏర్పడింది. గత ఏడాది డిసెంబర్ మొదటి వారంలో వచ్చిన తుపానుకు వరద నీరు 5రోజులు పలుచోట్ల రోడ్డుపై ప్రవహించడంతో రోడ్డు దెబ్బతినింది. అంచుల్లో ఐదారు అడుగుల లోతున మట్టి కోసుకుపోయింది. దీనివల్ల తారు రోడ్డు ముక్కలవుతుంది. సకాలంలో మరమ్మత్తులు చేయకపోవడంతో రోడ్డు మరింతగా దెబ్బతింటుంది. కొత్త రోడ్డు అందుబాటులోకి వచ్చి ఏడాది గడవకుండానే దెబ్బతినడం, మరమ్మతులు చేయకపోవడంపై ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. వెంటనే సంబంధిత అధికారులు మరమ్మత్తులు చేసి ఆ మార్గాన్ని ప్రయాణికులకు సౌకర్యవంతంగా చేయాలని కోరుతున్నారు. జిల్లా కేంద్రానికి వెళ్లేవారికి, రైతులకు ఎంతో ఉపయోగపడే ఈ రోడ్డు వెంటనే మరమ్మతులు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.


దెబ్బతిన్న రమణాయపాలెం రోడ్డు

ఎంపీడీఓగా రాఘవేంద్రనాథ్

ప్రజాశక్తి - కర్లపాలెం

మండల ప్రజలందరికీ అందుబాటులో ఉంటానని, సమస్యల పరిష్కారానికి అన్ని విధాల కృషి చేస్తానని ఎంపీడీఓ రాఘవేంద్ర నాథ్ అన్నారు. ఆయన ఎంపిడిఓగా గురువారం బాధ్యతలు తీసుకున్నారు. మండలంలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులు, ఎన్నికల పనులపై పంచాయితీ కార్యదర్శులతో సమీక్షించారు.


ఎంపీడీఓ రాఘవేంద్ర నాథ్


డాక్టర్ వైఎస్ఆర్, కోన విగ్రహాలు ఆవిష్కరిస్తున్న రఘుపతి

విలేజ్ క్లినిక్స్‌తో భరోసా

ప్రజాశక్తి - కర్లపాలెం

గ్రామాల్లో వైద్యుడి కోసం రోగులు ఎక్కడికి వెళ్లాల్సిన అవసరం లేదని, ప్రజలు వద్దకే వైద్యులను పంపిస్తున్న ఘనత వైసిపి ప్రభుత్వానిదని ఎంఎల్ఎ కోన రఘుపతి అన్నారు. మండలంలోని పాత నందాయపాలెం గ్రామంలో నూతనంగా నిర్మించిన వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ ఆయన గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ఆస్పత్రులు, వైద్యుల చుట్టూ తిరగాల్సిన అవసరం ఉండదని అన్నారు. ఫ్యామిలీ డాక్టర్‌తో వ్యాధులు ముదరకముందే గుర్తించవచ్చని తెలిపారు. డాక్టర్ వైఎస్ఆర్, కోన ప్రభాకరరావు విగ్రహాలు ఆవిష్కరించారు. వైఎస్ఆర్ ఇళ్ల స్థలాల పట్టాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కావూరి చిట్టెమ్మ, వైసిపి మండల అధ్యక్షులు యల్లవుల ఏడుకొండలు, ఎఎంసీ ఛైర్మన్ దొంతిబోయిన సీతారామిరెడ్డి, ఎంపీపీ యారం వనజ, ఎంపీటీసీలు తాండ్ర సాంబశివరావు, షేక్ ఆసిఫ్, వైసిపి నాయకులు చీరాల సత్యనారాయణరెడ్డి, కావూరి శ్రీనివాసరెడ్డి, స్థలదాత తునుగుంట్ల జగదీష్ పాల్గొన్నారు.


రోటరీ సమావేశంలో వడ్లమాని రవి

రోటరీ సేవలు విస్తృతపరచాలి

ప్రజాశక్తి - పర్చూరు

రోటరీ క్లబ్ నిర్వహిస్తున్న సర్వీస్ ప్రాజెక్టులను, ఇప్పటి వరకు రోటరీ చేసిన కార్యక్రమాలను పూర్వపు జిల్లా గవర్నర్లు వడ్లమాని రవి, జాస్తి రంగారావు, అన్నే రత్నప్రభాకర్, తాళ్ల రాజశేఖరరెడ్డి గురువారం సందర్శించారు. తగు సలహాలు సూచనలతో పాటు మెగా ప్రాజెక్ట్ నిర్వహించాలని, అందుకు తమ వంతు సహకారం అందచేస్తామని తెలిపారు. రాబోవు మూడేళ్లలో వంద మంచి నీటి చెరువుల అభివృద్ధికి సంసిద్ధమై తగిన ప్రణాళికలు తయారు చేసుకోవాలని తెలిపారు. పర్చూరు వాగుపై మరిన్ని చెక్ డ్యాంల ఏర్పాటుకు రోటరీ నుండి నిధులు ఏర్పాటు చేయిస్తామని తెలిపారు. రోటరీ జిల్లాలోనే రూరల్ ఏరియాలో ఇన్ని ప్రాజెక్టులు చేసింది పర్చూరు క్లబ్ మాత్రమేనని కొనియాడారు. ఇది రోటరీ జిల్లాకే రోల్ మోడల్ క్లబ్ అని తెలిపారు. గ్రామాల్లో తాగునీరు, పాఠశాలలు వంటి మౌళిక వసతులు కల్పించేందుకు రోటరీ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈపాటికే రోటరీ గంగ ద్వారా నీటి సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. సభకు క్లబ్ అధ్యక్షుడు నాగభైరు శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో కార్యదర్శి పంబి సదానందరెడ్డి, సీనియర్ సభ్యులు కొల్లా శివ రామ కృష్ణ ప్రసాద్, పాబోలు ఉదయ భాస్కర్, కొల్లా నరేంద్ర కుమార్, కోడూరి సుబ్రహ్మణ్య చారి, నాగబడి సుబ్బారావు, భవనం రాజగోపాలరెడ్డి, గడ్డిపాటి శ్రీనివాసరావు, కోట శ్రీనివాసరావు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులపై అవగాహన

ప్రజాశక్తి - చెరుకుపల్లి

పంటల సాగులో ఎరువుల వాడకం, యాజమాన్యం, సస్య రక్షణ చర్యలు సక్రమంగా తీసుకున్నట్లయితే అధిక దిగుబడులు సాధించవచ్చని డాట్ సెంటర్ సైంటిస్ట్ డాక్టర్ ఓబయ్య రైతులకు సూచించారు. మండలంలోని ఆరుంబాక రైతు భరోసా కేంద్రంలో మండల స్థాయిలో రైతులకు రబీ సాగులో పాటించవలసిన యాజమాన్య పద్ధతులు, సస్యరక్షణ చర్యలపై అవగాహన కల్పించారు. రబీ సీజన్లో రైతులు సాగుచేసిన పంట పొలాలను పరిశీలించారు. సెనగ, పెసర, మినుము పంటల గురించి, వాటి యాజమాన్య పద్ధతులు, సస్యరక్షణ చర్యలు, మందుల వివరాలను రైతులకు వివరించి సందేహాలు నివృత్తి చేశారు. మినుము పంటపై వచ్చేమచ్చ పురుగు, ఎల్లో మొజాయి వైరస్ తెగులు గురించి రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డిఆర్‌సి ఎ.ఒ బి ఉమామహేశ్వరి, ఎఒ టి బాలాజీ గంగాధర్, ఏఈఓలు పాల్గొన్నారు.


రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఇంటింటికీ టిడిపి మేనిఫెస్టో

ప్రజాశక్తి - చీరాల

టిడిపి ప్రతిపాదించిన సూపర్ సిక్స్ మేనిఫెస్టో క్యాలెండర్‌ను ప్రతి ఇంటికి తీసుకువెళ్లి అవగాహన కల్పించాలని టిడిపి ఇంచార్జ్ ఎంఎం కొండయ్య అన్నారు. పట్టణంలోని 15, 16, 17వార్డుల్లో ఇంటింటికి వెళ్లి టిడిపి మేనిఫెస్టో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు సిఎం అయితేనే రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వస్తాయని అన్నారు. మెరుగైన పారిశ్రామిక అభివృద్ధి చెంది రాష్ట్రం అన్ని రంగాల్లో ముందంజలో ఉంటుందని అన్నారు. టిడిపికి మద్దతు ఇవ్వాల్సిందిగా కోరారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు గజవల్లి శ్రీనివాసరావు, కొండ్రు రత్నబాబు, గంజి పురుషోత్తం, విన్నకోట జగదీష్, కర్ణ్యారపు సుబ్బలక్ష్మి, పృథ్వి రామారావు, కొట్టెం వంశీకృష్ణ, గోసాల శ్రీను, చౌడపల్లి రాంబాబు, ధోని కనకరాజు, ఎరిపిల్లి అప్పారావు, పోస హరిబాబు, దాసరి శ్రీనివాసరావు, పఠాన్ ఆయుబ్ ఖాన్, అక్కపల్లి కిరణ్ కుమార్, సిద్ధాబత్తుని రవికుమార్, మిక్కిలి వంశీ, గవిని ఏసుబాబు, బుర్ల రాముడు, కొతరపు జనార్ధనరావు, ఈడిగ మోహన్ గౌడ్, గవిని గోపి, గవిని శ్రీను, బుర్ల శ్రీరాములు, ఉసురుపాటి సురేష్, గవిని శ్రీనివాస్ యాదవ్, యర్రా శివనాగ మల్లేశ్వరి, భువనగిరి గురునారాయణ, కుంచాల రామాంజనేయులు పాల్గొన్నారు.


ఇంటింటికి ప్రచారంలో ఎంఎం కొండయ్య

సదస్సును జయప్రదం చేయాలని ప్రచారం

ప్రజాశక్తి - బల్లికురవ రూరల్

మంద కృష్ణ మాదిగ సదస్సులో భాగంగా బల్లికురవ గ్రామంలో పాంప్లెట్ ఆవిష్కరణ చేశారు. మందకృష్ణ మాదిగ నాయకత్వంలో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఆధ్వర్యంలో గత 30ఏళ్ల నుంచి ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరించాలని పోరాటం చేస్తూనే ఉన్నట్లు తెలిపారు. మంద కృష్ణ మాదిగ నాయకత్వంలో మాదిగల కోసమే కాకుండా సమాజంలో ఉన్న అన్ని సామాజిక వర్గాలకు సంక్షేమ పథకాలు వచ్చేదాంట్లో కృష్ణమాదిగ పోరాటాలు ఎన్నో ఉన్నాయని అన్నారు. చిన్న పిల్లల గుండె జబ్బులు కోసం పోరాటం చేస్తే ఆరోగ్యశ్రీ పథకం, వృద్దులు, వితంతువుల కోసం పోరాటం చేస్తే రూ.200 నుంచి రూ.3వేల వరకు పెన్షన్ పెరిగిందని అన్నారు. వికలాంగుల పెన్షన్ కోసం నిరంతరం పోరాటం చేసిన నాయకుడని అన్నారు. ఎస్సీ వర్గీకరణ సాధన చిట్ట చివరికి వచ్చిన సందర్భంగా మార్చి 2న మందకృష్ణ మాదిగ ఉమ్మడి ప్రకాశం జిల్లా ఎమ్మార్పీఎస్, ఎంఎస్పి, ఎంఈఎఫ్, ఎంఎస్ఎఫ్ కార్యకర్తల సదస్సుకు వస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంఎస్పి జిల్లా అధ్యక్షులు బుడంగుంట్ల లక్ష్మీ నరసయ్య మాదిగ, కందుకూరి పేతురు మాదిగ, బాబు మాదిగ, సారథి మాదిగ, పునూరి రమేష్ మాదిగ, ప్రసాద్ మాదిగ, వీరయ్య మాదిగ పాల్గొన్నారు.


కరపత్రం ఆవిష్కరిస్తున్న ఎంఆర్‌పిఎస్ నాయకులు


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

ఓటరు చైతన్య కళా యాత్ర

ప్రజాశక్తి - బాపట్ల

ఓటు వేద్దాం. ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేద్దాం. అనే నినాదంతో మార్చి 3నుండి ప్రారంభమయ్యే రాష్ట్ర స్థాయి ఓటరు చైతన్య కళాయాత్రను జయప్రదం చేయాలని సిటిజన్స్ ఫర్ డెమొక్రసీ ప్రజా సంఘాల విభాగం ఆహ్వాన కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు కోట వెంకటేశ్వర్లరెడ్డి, పిసి సాయిబాబు కోరారు. పట్టణంలోని సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ కార్యాలయంలో కళాజాత కరపత్రాలను ఆవిష్కరించారు. సమావేశానికి అసోసియేషన్ అధ్యక్షులు జీవి బ్రహ్మం అధ్యక్షత వహించారు. ఆహ్వాన కమిటీ అధ్యక్షులు ఫోరం ఫర్ బెటర్ కార్యదర్శి పిసి సాయిబాబు మాట్లాడుతూ ఎన్నికలు ప్రజాస్వామ్యానికి ప్రాణమని అన్నారు. ప్రజలందరూ తమ ఓటు హక్కును తప్పక వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఆహ్వాన కమిటీ కార్యదర్శి కోట వెంకటేశ్వర్లరెడ్డి మాట్లాడుతూ 2024లో జరగనున్న ఎన్నికలు అత్యంత కీలకమైనవని అన్నారు. రాజ్యాంగం ప్రసాదించిన ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయటం, చైతన్యాన్ని పెంపొందించాలని కోరారు. 16 మంది రాష్ట్ర స్థాయి కళాకారులు పాటలు, వివిధ ప్రదర్శనలు ప్రదర్శిస్తారని అన్నారు. కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ పట్టణ అధ్యక్షులు కె శ్రీహరి, పట్టణ కార్యదర్శి జెవి కృష్ణారావు, ప్రొఫెసర్ కారుమంచి విజయకుమార్, టి శంకర్ ప్రసాద్, కెఎన్ దీక్షితులు, డివి సుబ్బారావు, రావూరి నరసింహవర్మ, ఎస్ఎన్ గుప్తా పాల్గొన్నారు.

గొల్లపాలెంలో నేత్రదానం

ప్రజాశక్తి - ఇంకొల్లు రూరల్

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో మండలంలోని గొల్లపాలెంలో నేత్రదానం చేశారు. గ్రామానికి చెందిన నిమ్మగడ్డ లక్ష్మమ్మ (87) మృతి చెందగా కుటుంబ సభ్యులు నేత్రాలను దానం చేశారు. గుంటూరు శంకర కంటి వైద్యశాల వైద్యులు గ్రామానికి వచ్చి కార్నియా సేకరించారు. రోటరీ అవయవదాన కమిటీ ప్రతినిధులు జెట్టి వెంకటేశ్వర్లు, సోమేపల్లి రామ్మోహన్‌రావు, క్లబ్ అధ్యక్ష, కోశాధికారులు కరి కమలేశ్వరరావు, చుండి సాంబయ్య కుటుంబ సభ్యులు నిమ్మగడ్డ రామయ్య, రాములమ్మ, రవికాంత్, శ్రీకాంత్, వెనిగండ్ల శ్రీనివాస్‌లను అభినందించారు. నేత్ర దానం ప్రోత్సహించాలని కోరారు.


నిమ్మగడ్డ లక్ష్మమ్మ

రాష్ట్ర రాజకీయాలకు దిక్సూచిగా 'ఉమ్మడి' సభ

శాసనసభ్యుడు గొట్టిపాటి రవికుమార్

ప్రజాశక్తి - పంగులూరు

తాడేపల్లిగూడెం సభను చూసి తాడేపల్లి ప్యాలెస్ దద్దరిల్లిందని, రాబోయే ఎన్నికలు రాష్ట్రానికి అత్యంత కీలకమని, ఉమ్మడి సభ రాష్ట్ర రాజకీయాలకు దిక్సూచిగా మారిందని ఎంఎల్ఎ గొట్టిపాటి రవికుమార్ అన్నారు. మండలంలోని ముప్పవరంలో గల టిడిపి మండల కార్యాలయంలో జనసేన శ్రేణులతో ఆయన గురువారం సమావేశమయ్యారు. టిడిపి, జనసేన ప్రభుత్వంతోనే రాష్ట్ర భవిష్యత్తు ఆధారపడి ఉందని అన్నారు. గ్రామాల్లోని టిడిపి, జనసేన నేతలందరూ సమన్వయంగా ముందుకు వెళ్లి సూపర్ సిక్స్ పథకాలను ఇంటింటికి వివరించాలని సూచించారు. వైసిపి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించాలని చెప్పారు. తాడేపల్లిగూడెం సభ


జనసేన కార్యకర్తలతో ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్

విజయంతో రాష్ట్ర ప్రజల విజయపు జెండా ఖాయమైందన్నారు. కొత్త ప్రభుత్వంలో ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి ఎలా ముందుకు తీసుకువెళ్లాలనే అంశంపై టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ సభ ద్వారా స్పష్టం చేశారని తెలిపారు. ప్రజల జీవితాల్లో వెలుగులు నింపేందుకు, ప్రజలు పెట్టుకున్న కూటమి ఇది అని, జగన్‌రెడ్డి రాష్ట్రాన్ని విధ్వంసం లోకి తీసుకెళ్లారని అన్నారు. రాష్ట్ర పునర్నిర్మాణానికి ప్రజలు చేతులు కలపాల్సిన సమయం వచ్చిందని అన్నారు. పేదలకు అన్నం పెట్టే అన్న క్యాంటీన్లను జగన్‌రెడ్డి రద్దు చేశాడని మండిపడ్డారు. ప్రజా ప్రయోజనాల కోసం టీడీపీ సూపర్ సిక్స్ ప్రవేశపెట్టిందని అన్నారు. రాష్ట్రాన్ని ఎలా అభివృద్ధి చేయాలనే బ్లూ ప్రింట్ టిడిపి దగ్గర ఉందని అన్నారు. వైసీసీ ఓటమి భయంతో అనేక రకాల కుట్రలకు తెరలేపిందని అన్నారు. పొత్తును విఫలం చేసి, జనసేన, టీడీపీలు అనైక్యంగా ఉంటే విజయం సాధించవచ్చనే భ్రమలో ఉన్నారని, అది సాధ్యపడదని స్పష్టం చేశారు. తమ కూటమి విజయం చేరువలోనే ఉందని అన్నారు. రానున్న 50 రోజులు ప్రతి రోజూ ఉమ్మడి ఎజెండాను ప్రజల్లో తీసుకునివెళ్లి ప్రజా మద్దతు కూడగట్టాలని కోరారు. భారీ మెజారిటీయే లక్ష్యంగా ముందుకు వెళ్ళాలని అన్నారు.



మాట్లాడుతున్న సుధీర్ బాబు

'కోన'పై ఆరోపణలు సహించేది లేదు

ప్రజాశక్తి - బాపట్ల

ఎంఎల్ఎ కోన రఘుపతిపై టిడిపి ఇన్‌ఛార్జి వేగేశన నరేంద్ర వర్మ చేస్తున్న ఆరోపణలు నిరాధారమైనవని వైసిపి పట్టణ అధ్యక్షులు కాగిత సుధీర్ బాబు అన్నారు. వైసిపి కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నీతి, నిజాయితీ లేని రాజకీయాలు చేస్తున్న నరేంద్ర వర్మ బాపట్ల అభివృద్ధిని చూసి ఓర్వలేకపోతున్నారని అన్నారు. నరేంద్రవర్మ మాఫియా వ్యాపారాలకు సంబంధించిన ఆధారాలు ఉన్నాయని అన్నారు. ఎస్సి భూములు రెండెకరాలు కబ్జా చేసుకొని నీళ్ల తోడుకోని అమ్ముకుంటున్నట్లు ఆరోపించారు. దమ్ము, ధైర్యం ఉంటే గంజాయి ఎవరు అమ్ముతున్నారో ఆధారాలతో ఎస్పికి ఫిర్యాదు చేయాలని అన్నారు. ప్రభుత్వంపై, వైసిపి నాయకులపై ఆరోపణలు చేస్తే కఠినమైన చర్యలు తీసుకుంటాయని హెచ్చరించారు. సమావేశంలో మాల్యాద్రి, సయ్యద్ పీర్, జోగి రాజా, వెంకట్రావు పాల్గొన్నారు.

నిధుల దుర్వినియోగంపై విచారణ

ప్రజాశక్తి - పర్చూరు

మండలంలోని ఉప్పుటూరు గ్రామంలోని వెంకటేశ్వర స్వామి దేవాలయంలో గతంలో కార్యనిర్వహణ అధికారిగా పనిచేసిన వ్యక్తిపై 34 ఛార్జ్ షీట్స్ నమోదైన నేపథ్యంలో అధికారులు వాటిపై విచారణ చేపట్టారు. జాయింట్ కమిషనర్ భ్రమరాంబ, అసిస్టెంట్ కమిషనర్ పానకాల రావు దేవాలయంలో, కార్యాలయంలో సంబంధిత పత్రాలను గురువారం పరిశీలించారు. విచారణ అనంతరం ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామని తెలిపారు.

ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

నేటి నుండి జరగనున్న ఇంటర్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఇఒ ఎంసిహెచ్ వస్రం నాయక్ తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కాలేజీ నందు 227మంది, హర్షిణి జూనియర్ కాలేజ్ నందు 325 మంది, రాయల్ జూనియర్ కాలేజ్ నందు 495మంది విద్యార్థులు మొదటి, రెండవ సంవత్సరం ఇంటర్ పరీక్షలకు హాజరు కానున్నట్లు తెలిపారు. 45 మంది ఇన్విజిలేటర్ల పర్యవేక్షణలో పరీక్షలు అత్యంత కట్టు దిట్టంగా నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఇంకొల్లు రూరల్ : నేటి నుండి 15వరకు డిఎన్ఎం జూనియర్ కళాశాల, డ్రీమ్జ్ జూనియర్ కళాశాల్లో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. డిఎన్ఎం జూనియర్ కళాశాల్లో ప్రథమ సంవత్సరం 1,159మంది, ద్వితీయ సంవత్సరం 1,240మంది, డ్రీమ్జ్ జూనియర్ కళాశాల్లో ప్రథమ సంవత్సరం 1,589 మంది, ద్వితీయ సంవత్సరం 1,353 మంది పరీక్షలు రాయను న్నారు. ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు జరగనున్నాయి. ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతించేది లేదని డిఎన్ఎం జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ యు రవికుమార్ తెలిపారు.

పశువైద్య పథకాలపై సమీక్ష

ప్రజాశక్తి - పర్చూరు

పశు సంవర్ధక అధికారి డాక్టర్ ఎం హనుమంతరావు స్థానిక ఎంపిడిఒ కార్యాలయం నందు పర్చూరు, ఇంకొల్లు ప్రాంతీయ వైద్యశాలల పరిధిలోని 4మండలాల స్థాయి పశువైద్య సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. సమీక్షలో వివిద పథకాలకు సంబంధించి చర్చించారు. వ్యాధి నిరోధక టీకాలు, వైఎస్ఆర్ పశు భీమా, పశు ఆరోగ్య కార్డులు జారీ పురోగతి పనితీరుపై సమీక్షించారు. ఈ ప్రాంతంలోని అన్నీ పాల సేకరణ కేంద్రాల నిర్వాహకులు వచ్చే ఈనెల 10లోగా ఆంధ్రప్రదేశ్ పాల సేకరణ చట్టం నకు లోబడి సంబంధిత పశువైద్యాధికారిని సంప్రదించి అనుమతి పొందాల్సిన అవశ్యకత ఉందని తెలిపారు. పశు వైద్య సిబ్బంది తమ ప్రాంతంలోని పాల సేకరణ కేంద్రాలను సందర్శించి అక్కడ వాడబడుతున్న మిల్క్ టెస్టర్, మిల్క్ ఎనలైజర్ మిషన్లకు ల్యైసెన్స్ పొందాల్సిన ఆవశ్యకతను వివరించాలని చెప్పారు. అనుమతి పొందని



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ ఎం హనుమంతరావు

పాల సేకరణ కేంద్రాలపై చట్టం ప్రకారం కేసులు వర్తింప చేస్తామని హెచ్చరించారు. చట్టం అతిక్రమిస్తే పాల సేకరణ కేంద్రాలను సీజ్ చేయబడటం తో పాటు గరిష్టంగా రూ.50వేల వరకు అపరాధ రుసుం విధిస్తారని తెలిపారు. కార్యక్రమంలో పర్చూరు, ఇంకొల్లు ప్రాంతీయ పశు వైద్య సహాయ సంచాలకులు డాక్టర్ మాధవి, డాక్టర్ వెంగళరావు, పశువైద్యాధికారులు పాల్గొన్నారు.

వైసిపి అరాచక పాలనపై యుద్ధం


టిడిపి సమావేశంలో మాజీ మంత్రి నక్కా ఆనందబాబు

ప్రజాశక్తి - కొల్లూరు

మండలంలో టిడిపి, జనసేన సర్వసభ్య సమావేశం ఎంప్లాయిస్ రిక్రియేషన్ క్లబ్ నందు గురువారం నిర్వహించారు. సమావేశంలో మాజీ మంత్రి నక్కా ఆనందబాబు మాట్లాడుతూ సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం అడ్డగోలుగా సంపాదించిన డబ్బుతో ఓట్లు కొని మరలా గెలవాలని చూస్తుందని అన్నారు. అందువలన ప్రతి నాయకుడు, కార్యకర్త నిరంతరం ప్రజల్లో ఉండి టిడిపి, జనసేన అధికారంలోకి వచ్చిన తర్వాత చేయ బోయే పథకాలను ప్రజలకు వివరించాలని కోరారు. రాబో యే 40రోజులు ముఖ్యమైనవని అన్నారు. కార్యక్రమంలో వేమూరు నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జి ఉషా రాజేష్, టిడిపి మండల అధ్యక్షులు మైనేని మురళీకృష్ణ, తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ కనగాల మధుసూదన ప్రసాద్, జనసేన మండల అధ్యక్షులు చలమయ్య, టిడిపి, జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.

రేపల్లె : వైసిపి అరాచక పాలనను తరిమి కొట్టేందుకు టిడిపి, జనసేన యుద్ధం ప్రకటించాయని టిడిపి రాష్ట్ర కార్యదర్శి గూడపాటి శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలోని 15, 16వార్డుల్లో బాబు ష్యూరిటి, భవిష్యత్ గ్యారెంటీ కార్యక్ర మాన్ని గురువారం నిర్వహించారు. సూపర్ సిక్స్ కరపత్రా లను ప్రతి ఇంటికీ అందజేశారు. చంద్రబాబు, పవన్ కళ్యాణ్ రాష్ట్ర ప్రజల ప్రయోజనం కోసం ఉమ్మడి అజెండాతో ముందుకు వెళుతున్నారని వివరించారు. వైసిపి పాలనలో రాష్ట్రం అన్నిరంగాలలో దివాళా తీసింద న్నారు. సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని మరోసారి గెలిపిస్తే రాష్ట్రం మరింత దిగజారిపోతుందని అన్నారు. అభివృద్ధి, సంక్షేమం, ప్రజా శ్రేయస్సు జనసేన, టిడిపితోనే సాధ్యమ న్నారు. టిడిపి నాయకులు జీపి రామారావు, తాత ఏడు కొండలు, జనసేన అధ్యక్షులు రాసంశెట్టి మహేష్, వెనిగళ్ళ సుబ్రమణ్యం, జానకిరామయ్య, కేసన నరసింహారావు, దేవగిరి రవి, గొట్టిపాటి మహేష్ పాల్గొన్నారు.


సమావేశంలో గూడపాటి శ్రీనివాసరావు

వివేక హైస్కూల్లో ప్రమోషన్ డే వేడుకలు

ప్రజాశక్తి - కొల్లూరు

వివేక ఎడ్యుకేషన్ విద్యా సంస్థల ఆధ్వర్యంలో స్థానిక కాకతీయ కళ్యాణ మండపంలో ప్రమోషన్ డే వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. స్కూలు డైరెక్టర్ రావిపాటి వీరనారాయణ, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు గుత్తా వెంకటరత్నం, కె రామరాజు పాల్గొన్నారు. ఒకటవ తరగతి నుండి 9వ తరగతి విద్యార్థులకు పట్టభద్రుల వేషధారణ ధరింప చేయించి ప్రమోషన్ సర్టిఫికెట్లు అందజేశారు.


పట్టభద్రుల వేషధారణ ధరింప చేయించిన విద్యార్థులు


గృహప్రవేశ కార్యక్రమంలో హనిమిరెడ్డి

వైసిపి కార్యకర్త ఇంటికి హనిమిరెడ్డి

ప్రజాశక్తి - పంగులూరు

ప్రతిరోజు నియోజకవర్గంలోని వైసీపీ కార్యకర్తల ఇళ్లల్లో జరిగే అనేక శుభ కార్యక్రమాల్లో పాల్గొనే వైసిపి ఇన్చార్జి పానెం చిన హనిమిరెడ్డి గురువారం మండలంలోని ముప్పవరం గ్రామానికి చెందిన దండు సుబ్బారెడ్డి నూతన గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన అక్కడ చేరిన వైసీపీ కార్యకర్తలతో ముచ్చటించారు. గ్రామం గురించిన అనేక విషయాలను కార్యకర్తలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైసీపీ మండల ఇన్చార్జి బిజ్జం శ్రీనివాసరెడ్డి, ఎపి రెడ్డి సంఘం ఉమ్మడి ప్రకాశం జిల్లా అధికార ప్రతినిధి చిలంకూరి శంకరరెడ్డి, వైసిపి మండల ప్రచార కమిటీ అధ్యక్షులు లోకిరెడ్డి కృష్ణారెడ్డి, కలికి శివారెడ్డి, భీమనాదం సుబ్బారెడ్డి, కామేపల్లి వెంకట శివప్రసాద్ పాల్గొన్నారు.

నేడు జగనన్న విద్యా దీవెన

ప్రజాశక్తి - బాపట్ల


రాజ దెబోర

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న నవరత్నాల్లో భాగంగా జగనన్న విద్యా దీవెన మొదటి విడత మార్చి 1న విడుదల చేస్తారని ఎస్సీ సంక్షేమం సాధికారత అధికారి రాజ దెబోర గురువారం తెలిపారు. జిల్లాలో డిగ్రీ నుండి పిజి, ఇంజనీరింగ్, మెడికల్ ఇతర కోర్సుల ఎస్‌సి, ఎస్‌టి, బిసి, ఇబిసి, మైనారిటీ విద్యార్థినీ, విద్యార్థులకు 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించిన జగనన్న విద్యా దీవెన మొదటి విడత నిధులను సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి కృష్ణా జిల్లా పామర్రు వేదికగా నేరుగా తల్లుల ఖాతాల్లో జమచేయనున్నట్లు తెలిపారు. స్థానిక కలెక్టర్ కార్యాలయంలో జరిగే కార్యక్రమంలో విద్యార్థుల తల్లులకు చెక్కులు పంపిణీ చేస్తారని తెలిపారు.

బార్ అసోసియేషన్‌కు విరాళం

ప్రజాశక్తి - పర్చూరు

బార్ అసోసియేషన్ సీనియర్ న్యాయవాది యార్లగడ్డ వెంకటేశ్వరరావు న్యాయవాదిగా 40ఏళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగ బార్ అసోసియేషన్ అభివృద్ధి కొరకు రూ.40వేల విరాళం ఇచ్చారని అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కొల్లా నరేంద్ర కుమార్, రావి శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక న్యాయవాదులు వెంకటేశ్వరరావుకు శుభాకాంక్షలు తెలిపారు.

పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలపై సమీక్ష

ప్రజాశక్తి - ఇంకొల్లు రూరల్


సమీక్షిస్తున్న తహశీల్ధారు ప్రమీల

స్థానిక తహశీల్దారు కార్యాలయంలో తహశీల్దారు ఎం ప్రమీల అధ్యక్షతన సమీక్ష సమావేశం గురువారం నిర్వహించారు. సాధారణ ఎన్నికలకు సంబంధించి పోలింగ్ కేంద్రాల్లో కనీస సౌకర్యాలు లేకుంటే వెంటనే పూర్తి చేయాలని సూచించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలను అనుసరించి అన్ని పోలింగ్ కేంద్రాల్లో ర్యాంపు, వాటర్, టాయిలెట్ సౌకర్యాలు లేకుంటే వెంటనే ఏర్పాటు చేయాలని వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. సమావేశంలో ఎంపిడిఒ కె శ్రీదేవి, ఇఓఆర్‌డి శ్రీనివాస్, ఎంఇఒ రాఘవరావు, సర్వేయర్ ఏడుకొండలు, ఏఎస్ఓ పుష్పలత పాల్గొన్నారు.



వాలంటీర్లను సత్కరిస్తున్న బూచేపల్లి

వాలంటీర్లుగా ఉండాలంటే..

జగన్ సిఎంగా ఉండాలి..

వైసిపి దర్శి ఇన్‌ఛార్జి బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి-దర్శి

వచ్చే ఎన్నికల తరువాత వాలంటీర్లుగా ఉండాలంటే జగన్ మళ్లీ సిఎంగా ఉండాలని, వాలంటీర్లు జగన్ కోసం కష్టపడాలని మాజీ ఎమ్మెల్యే, వైసీపీ ఇన్‌ఛార్జి డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి అన్నారు. గురువారం తాళ్లూరు మండలంలో గ్రామ వాలంటీర్లకు వందనం అనే కార్యక్రమం ఎంపీడీవో కె.యుగకీర్తి ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ పేద ప్రజలందరికీ పథకాలన్నీ అందాలంటే జగనే ముఖ్యమంత్రి కావాలన్నారు. పేదవాళ్ల కోసం నిరంతరం కష్టపడే వ్యక్తి జగన్‌మోహన్‌రెడ్డి అని, పథకాలన్నీ అందరికీ అందే విధంగా వాలంటీర్లు కృషి చేయడం అభినందనీయమని అన్నారు. మాట మీద నిలబడే వ్యక్తి జగన్‌మోహన్‌రెడ్డి అని పేర్కొన్నారు. జగనన్నది ఆశయం అని, చంద్రబాబుది ఆశ అని అన్నారు. ఆశయం కోసం గ్రామ వాలంటీర్లు పనిచేయాలని కోరారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ మాట్లాడుతూ వంద శాతం వాలంటీర్ల కృషి వల్లే ప్రభుత్వ పథకాలు నేరుగా ప్రజలకు అందుతున్నాయని అన్నారు. వాలంటీర్లు గ్రామాల్లో బాగా పనిచేస్తున్నారని, ఈ వ్యవస్థ ఎప్పుడు ఉండాలంటే జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకోవాలన్నారు. 99 శాతం హామీలు అమలు చేసిన ఘనత జగన్‌కే దక్కిందన్నారు. 2024 ఎన్నికల్లో తన కుమారుడు పోటీ చేస్తున్నందున వాలంటీర్లు కష్టపడి ప్రతి ఇంటికీ వెళ్లి పథకాల గురించి చెప్పి.. ఓటు వేయించాలని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలుపు కోసం అందరూ కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా సేవా మిత్ర, సేవారత్న, సేవా వజ్ర పథకాలను వాలంటీర్లకు అందించారు. కార్యక్రమంలో ఎంపీపీ తాడిపర్తి శ్రీనివాసరావు, జడ్పీటీసీ మారం వెంకటరెడ్డి, వైస్ ఎంపీపీలు ఇడమకంటి వెంకటేశ్వరరెడ్డి, మంచాల ప్రియాంక నాగార్జునరెడ్డి, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు మారం ఇంద్రసేనారెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు తూము సుబ్బారెడ్డి, జిల్లా కోఆప్షన్ మెంబరు ఆదాం(బుజ్జి), జేసీఎస్ కన్వీనర్ జాజం శ్రీనివాసరెడ్డి, గ్రామాల సర్పంచ్‌లు వలి, సుమలత శ్రీకాంత్‌రెడ్డి, శివలక్ష్మీ, వెంకటరామిరెడ్డి, ఐవీరెడ్డి, పులి ప్రసాద్‌రెడ్డి, గ్రామ ఎంపీటీసీ ప్రభుదాసు, మాజీ ఎంపీపీలు, పోశం మధుసూదన్‌రెడ్డి, రామిరెడ్డి, గోళ్ళపాటి మోషే, ప్రసాదరావు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ అర్జున్‌నాయక్‌తో పాటు గ్రామ వాలంటీర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



హెడ్‌కానిస్టేబుల్‌ను సత్కరిస్తున్న ఎస్‌పి పరమేశ్వర్‌రెడ్డి

హెడ్ కానిస్టేబుల్‌కు ఎస్‌పి సన్మానం

ప్రజాశక్తి-ఒంగోలు క్రైం

పోలీసు శాఖలో చేరి దాదాపు 33 సంవత్సరాల సుదీర్ఘ కాలం పాటు అమూల్యమైన సేవలు అందించి పోలీస్ ఉన్నతాధికారులు అభినందనలు పొందుతూ గురువారం ఉద్యోగ విరమణ చేసిన ఒంగోలు తాలూకా పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ ఎస్‌కె.అహ్మద్ భాషాను జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ పరమేశ్వరరెడ్డి శాలువా, పుష్పగుచ్ఛాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ విధి నిర్వహణలో ఎంతో నిబద్ధత, అంకితభావంతో జిల్లా పోలీస్ శాఖకు అందించిన సేవలను శాఖ ఎప్పటికీ గుర్తుంచుకుంటుందన్నారు. సుదీర్ఘకాలం పాటు కేటాయించిన అన్ని విధులు చక్కగా నిర్వర్తించడం అభినందనీయమన్నారు. ఉద్యోగ విరమణ అనంతర జీవితాన్ని కుటుంబ సభ్యులతో సుఖసంతోషాలతో, ఆనంద, ఆయురారోగ్యాలతో గడపాలని ఆకాక్షించారు. భవిష్యత్లో ఎటువంటి సహకారం అవసరమైనా పోలీసుశాఖ తప్పకుండా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఏఎస్పీ (అడ్మిన్) కె.నాగేశ్వరరావు, ఏఎస్పీ (క్రైమ్) యస్.వి.శ్రీధర్‌రావు, డిఎస్పీలు రామచంద్ర, రామరాజు, అశోక్ వర్ధన్, బాల సుందరం, వి.శ్రీనివాసులు, సిహెచ్ శ్రీనివాసరావు, ఏఆర్ డీఎస్పీ చంద్ర శేఖర్, ట్రైనీ డిఎస్పీ షేక్ షహబాజ్, సీఐలు, ఆర్‌ఐ, ఎస్సైలు పాల్గొన్నారు.

వస్తువుల కొనుగోలులో నాణ్యత పాటించండి

డిపిఒ నారాయణరెడ్డి ఆదేశం



మాట్లాడుతున్న డిపిఒ నారాయణరెడ్డి

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

గ్రామ పంచాయతీలలో కొనుగోలు చేసే వివిధ రకాల వస్తువులలో నాణ్యత పాటించాలని జిల్లా పంచాయతీ అధికారి జివి నారాయణరెడ్డి పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లను ఆదేశించారు. స్థానిక పాత జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో రాష్ట్ర ప్రభుత్వం ఎపిడిఐఆర్‌డి, బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్(బిఐఎస్) ఆధ్వర్యంలో వివిధ రకాల మెటీరియల్స్ నాణ్యత ప్రమాణాలపై పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులకు అవగాహన కార్యక్రమం గురువారం జరిగింది. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా డిపిఒ జివి నారాయణరెడ్డి మాట్లాడుతూ గ్రామ పంచాయతీల్లో కొనుగోలు చేసే వివిధ రకాల వస్తువులు ఉత్తమ నాణ్యతా ప్రమాణాలు కలిగిన కంపెనీలవి కొనాలన్నారు. బిఎస్‌ఐ హాల్ మార్క్ ఉండేలా చూసుకోవాలని సూచించారు. బిఎస్‌ఐపై ప్రతి ఒక్కరు అవగాహన పెంచుకొని వస్తువులను కొనుగోలు చేయాలన్నారు. పంచాయతీల్లో ప్రజల అవసరాల కోసం కొనుగోలు చేసే సిమెంట్, స్టీల్, వ్యవసాయ పనిముట్లు, కార్యాలయాలకు అవసరమైన వస్తువులు, స్టేషనరీ, ఎలక్ట్రికల్ కేబుల్స్, పివిసి పైప్స్, మాస్కులు, గ్యాస్ స్టవ్, ప్రెజర్ కుక్కర్ వంటి వస్తువులకు సంబంధించి బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ హాల్ మార్కింగ్‌పై ప్రత్యేక దష్టి సారించాలన్నారు. ఎపిఎస్‌ఐఆర్‌డి డిప్యూటీ డైరెక్టర్ రామనాథం ఈ వస్తువుల కొనుగోలు, వ్యాలిడిటీ వంటి అంశాలను బిఎస్‌ఐ కేర్ యాప్ ద్వారా అవగాహన కల్పించారు. బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్(బిఎస్‌ఐ) హైదరాబాద్ శాఖ జాయింట్ డైరెక్టర్ పివి శ్రీకాంత్, సైంటిస్ట్, జడ్పీ డిప్యూటీ సిఇఒ హనుమంతరావు పాల్గొని బిఎస్‌ఐపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు, డిపిఆర్‌సి సిబ్బంది పాల్గొన్నారు.

పిడిఐల వివరాలు నమోదు చేయాలి

సుస్థిరాభివద్ధి లక్ష్యాల ప్రకారం పంచాయతీ అభివద్ధి సూచిక (పిడిఐ)ల వివరాలను ఖచ్చితత్వంతో నమోదు చేయాలని జిల్లా పంచాయతీ అధికారి జివి నారాయణరెడ్డి మండల విస్తరణాధికారులను ఆదేశించారు. పిడిఐపై జిల్లా పంచాయతీ అధికారి, జడ్పీ సిఇఒ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డిపిఒ మాట్లాడుతూ పంచాయతీ అభివద్ధి సూచిక (పిడిఐ) లో భాగంగా ఎస్‌డిసి లక్ష్యాలు, పేదరికం లేని మెరుగైన జీవనోపాధి గ్రామం, ఆరోగ్యకరమైన గ్రామం, పిల్లల స్నేహపూర్వక గ్రామం, నీరు తగినంత గ్రామం, స్వచ్ఛమైన, ఆకుపచ్చ గ్రామం, స్వయం సమద్ధిగా ఉన్న గ్రామం, సామాజిక, గ్రామీణ ప్రాంతాల్లో స్వయం సమద్ధి మౌలిక సదుపాయాలు, గుడ్ గవర్నెన్స్ , ఉమెన్ ఫ్రెండ్లీ విలేజ్‌లో భాగంగా వివిధ శాఖల డేటాను పంచాయతీ సెక్రటరీలు పిడిఐ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. ఈ నెల 7 లోపు ప్రతి ఒక్కరు అప్‌లోడ్ చేయాలని సూచించారు. గ్రామసభలు నిర్వహించి తదుపరి లైన్ డిపార్ట్మెంట్ లకు డేటా పంపించాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిడిఒలు, విస్తరణ అధికారులు పంచాయతీ సెక్రటరీలు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రీడాకారులుగా ఎదగాలి

- ఒంగోలు ఎంపీ మాగుంట
- పిసిఎల్ మెగా ఫైనల్స్ ప్రారంభం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్




క్రికెట్ ఆడుతున్న ఎంపీ మాగుంట

క్రికెట్‌లో నైపుణ్యాలను పెంపొందించుకొని రాష్ట్రస్థాయి క్రీడాకారులుగా ఎదగాలని ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి ఆకాంక్షించారు. స్థానిక పివిఆర్ బాలుర ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో ప్రకాశం ప్రీమియర్ లీగ్(పిసిఎల్) బై మాగుంట మెగా ఫైనల్స్ టోర్నమెంట్ గురువారం ప్రారంభమైంది. ఈ టోర్నమెంట్‌లో ఏడు నియోజకవర్గాలలో విన్నర్స్, రన్నరప్ టీమ్స్ 14 జట్లు పాల్గొంటున్నాయి. ఈ సందర్భంగా ఒంగోలు బోర్డర్ బాయ్స్, యర్రగొండపాలెం విక్టరీ బాయ్స్ టీమ్ క్రీడాకారులను ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి పరిచయం చేసుకొని శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాగుంట మాట్లాడుతూ జిల్లాలోని 7 నియోజకవర్గాల నుంచి 14 జట్లు మెగా ఫైనల్స్‌లో పాల్గొంటున్నాయన్నారు. క్రికెట్‌లో క్రీడా నైపుణ్యాలను పెంపొందించుకోవాలని, స్నేహపూర్వకంగా క్రీడాకారులు మెలగాలన్నారు. అన్ని జట్లూ బాగా ఆడి విజయం సాధించాలన్నారు. మెగా ఫైనల్స్‌లో యర్రగొండపాలెం, కొండపి, దర్శి జట్లు విజయం సాధించాయి. కార్యక్రమంలో ఏఎంసి మాజీ చైర్మన్ అయినాబత్తిన ఘన శ్యాం, డిసిఎంఎస్ మాజీ ఛైర్మన్ బెల్లం సత్యం, ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ మెంబర్, జోన్ ఇంచార్జి వెంకటాద్రి రెడ్డి, రావూరి బుజ్జి, పలువురు నాయకులు క్రీడాకారులు పాల్గొన్నారు.

దాతల పేర్లు ఎలా పెడతారు?

- అభివృద్ధి పనులకు దాతల పేర్లపై కౌన్సిల్ సమావేశంలో వాగ్వాదం
- వాకౌట్ చేసిన 16వ వార్డు కౌన్సిలర్ ప్రభాకర్‌రావు
- రెండు అంశాలు మినహా మిగతావన్నీ ఆమోదం



కౌన్సిల్ సమావేశంలో వాదన పడుతున్న కౌన్సిలర్లు, వాకౌట్ చేస్తున్న కౌన్సిలర్ ప్రభాకర్

ప్రజాశక్తి-చీరాల

మున్సిపల్ పరిధిలోని ఎన్‌ఆర్‌ఐ పీఎం హైస్కూల్‌లో జరుగుతున్న అభివద్ధి పనులకు, జిమ్, గేట్, పార్క్‌లకు స్థల దాతల పేర్లు పెట్టాలని 16 వార్డు కౌన్సిలర్ గుంటూరు ప్రభాకర్‌రావు కౌన్సిల్ సమావేశంలో ప్రతిపాదించారు. 125 సంవత్సరాల చరిత్ర గల బాయ్స్ హై స్కూల్‌లో జరిగిన పనులకు దాతల పేర్లు ఎలా పెడతారని 17వ వార్డు కౌన్సిలర్ బాలకష్ణ, మాజీ ఎమ్మెల్యే ఆమంచి గ్రూపునకు చెందిన 25వ వార్డు కౌన్సిలర్ పాపిశెట్టి సురేష్ ఆ ప్రతిపాదనను వ్యతిరేకించారు. దీంతో కౌన్సిలర్ గుంటూరు ప్రభాకర్‌రావు పదేపదే చెప్పే ప్రయత్నం చేశారు. చైర్మన్ జంజనం శ్రీనివాసరావు కౌన్సిలర్లకు సర్దిచెప్పే ప్రయత్నం చేస్తున్నప్పటికీ వినిపించుకోకుండా కౌన్సిలర్ ప్రభాకర్‌రావు కౌన్సిల్ సమావేశం నుండి నిష్క్రమిస్తున్నట్టు కేకలు వేస్తూ..బయటకు వెళ్లిపోయారు. ఈ నేపథ్యంలో మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం కొద్దిపాటి వివాదాలు మినహా ప్రశాంతంగా జరిగింది. అజెండాలో ముప్పై తొమ్మిది అంశాలు పొందుపరచగా వాటిలో 7, 17వ అంశాలపై 15, 16 వార్డుల కౌన్సిలర్ల మధ్య వాదోపవాదాలు జరిగాయి. అనంతరం ఆ రెండు అంశాలు రద్దు చేయబడ్డాయి. ఈ సందర్భంగా చైర్మన్ శ్రీనివాసరావు మాట్లాడుతూ కౌన్సిల్ సభ్యులందరూ సభా మర్యాదను పాటించాలని, కౌన్సిల్ సమావేశం జరిగే సమయంలో మధ్యలో వెళ్ళిపోవటం సరైన పద్ధతి కాదని సూచించారు. అనంతరం పలు అంశాలపై చర్చించారు.